PRAJAPAKSHAM ★

www.prajapakshand.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

2024, మార్చి 22 శుక్రవారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 274, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: Hyderabad
Khammam, Karimnagar, Mahabubnagar

తర తరాల పిల్లల కథలు
రూ।। 70/-
పేజీలు: 64



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

## ఢిల్లీ మద్యం కేసులో
# కేజ్రీవాల్ అరెస్టు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీలో గురువారం అత్యంత నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంటికి సర్చ్ వారెంటుతో వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు, ఆయనను ప్రశ్నించిన వెంటనే అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాదిగా ఆప్ నాయకులు, కార్యకర్తలు కేజ్రీవాల్ నివాసానికి చేరుకొని, ఇడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీ

తరువాయి 8లో

## సిఎఎతో భారతదేశ
# ఉనికికే ప్రమాదం

సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా

హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇన్సాఫ్ నిరసన




ప్రజాపక్షం / హైదరాబాద్

ఎంతో వివాదాస్పదమైన సిఎఎ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మళ్లీ తీసుకురావడమనేది ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ఉన్న విలువను ఔన్నత్యాన్ని తగ్గిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి, ఆల్‌ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ అజీజ్‌పాషా, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిఎఎతో భారతదేశం ఉనికి ప్రమాదంలో పడుతుందని వారు హెచ్చరించారు. సిఎఎ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా, ఎస్‌ఎండి ఫయాజ్, మునీర్ పటేల్ మాట్లాడుతూ 2019లో కూడా ఇలాగే సిఎఎ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తే దేశంలోని మైనారిటీలు, కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు తదితర అనేక వర్గాలకు చెందిన ప్రజలంతా పెద్దఎత్తున ప్రతిఘటించి ఢిల్లీ నగరంలో షహీన్‌బాగ్ వద్ద నెలల తరబడి నిర్విరామ ఉద్యమం కొనసాగించారని, ఆ ఉద్యమంతో వెనుకడుగు వేసిన బిజెపి ప్రభుత్వం మళ్ళీ ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రజలను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఈ చట్టాన్ని అమలు చేస్తున్నామని ప్రధాని మోడీ ప్రభుత్వం మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. సిఎఎ చట్టాన్ని ఎట్టి పరిస్థితిలో అమలు చేయనీయబోమని ఇన్సాఫ్ నేతలు ప్రకటించారు. ఇంతకుముందు జరిగిన ఆందోళనలో వంద మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, ఇప్పుడు ఎంతమంది ప్రాణాలు బలి తీసుకోవడానికి బిజెపి ప్రభుత్వం ఈ రకమైన చట్టాలను తీసుకొస్తుందని ఆగ్రహం

తరువాయి 2లో





వాట్సాప్‌లో 'వికసిత్ భారత్'
# ప్రచారానికి ఇసిఐ బ్రేక్

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఇన్నమొన్న ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) రాజ్యాంగ విరుద్ధమైనదని పేర్కొంటూ, వాటిని సుప్రీం కోర్టు రద్దు చేయగా, తాజాగా, 'వికసిత్ భారత్' పేరుతో, వాట్సాప్ ద్వారా బిజెపి కొనసాగిస్తున్న ప్రచారానికి భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) బ్రేక్ వేసింది. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఇప్పటికే, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, కాబట్టి ప్రముఖ మెసేజింగ యాప్ వాట్సాప్‌లో చేస్తున్న 'వికసిత్ భారత్' ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని గురువారం ఇసిఐ ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 2014లో, కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి, అంటే, గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, 'వికసిత్ భారత్' క్యాంపెయిన్‌ను వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాల్లో కొనసాగిస్తున్నది. ఈ ప్రచారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్

తరువాయి 2లో

## ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో
# బాండ్ల వివరాలు




**న్యూఢిల్లీ:** ప్రత్యేక నెం బర్లు, కెవైసి వంటి అన్ని వివరాలతో ఎలక్టోరల్ బాండ్ల సమగ్ర సమాచారాన్ని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సమర్పించింది. ఆ వెంటనే ఆ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ఇసిఐ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్)ను రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని రద్దు చేయడమేగాక, కొనుగోలుదారులు, లబ్ధిదారుల వివరాలు ఇసిఐకి ఇవ్వాలని కూడా ఆదేశించింది. గోప్యతా కారణాల వల్ల సమాచారాన్ని ఇవ్వలేమని, జూన్ 30 వరకూ గడువు పెంచాలని ఎస్‌బిఐ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీనితో బాండ్ల వివరాలను ఇటీవల ఎస్‌బిఐ వెల్లడించింది. అయితే, న్యూమరికల్ నంబర్, కెవైసి వంటి సమాచారాన్ని ఇవ్వకుండా దాటవేసింది. దీనితో సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించి, బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఈనెల 21వ తేదీ, గురువారం లోగా ఇవ్వాలని

తరువాయి 2లో



## కష్టపడే వారిని ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తాం

**ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్

కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములు చేసే బాధ్యత తమదని, మల్కాజిగిరి ప్రచార మోడల్, రాష్ట్రమంతా అనుసరించేలా ఉండాలలని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలో భాగంగా జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అతిథి గృహంలో కాంగ్రెస్

తరువాయి 2లో

# ఉన్నోళ్ల మారాజు మన మోడీజీ!

1 శాతం మహాకుబేరుల చేతికి జాతీయాదాయంలో 22.6 శాతం

10 శాతం కుబేరుల చేతికి 57.7 శాతం : దిగువ 50 శాతం జనాభా ఆర్జన 15 శాతమే

27.3 శాతానికి దిగజారిన 40 శాతం మధ్యతరగతుల వాటా

స్వాతంత్ర్యంనాటి పరిస్థితులే మేలంటున్న అంతర్జాతీయ నివేదిక

ప్రత్యేక కథనం 04



# ప్రణీత్ రావు పిటిషన్ డిస్మిస్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసు కస్టడీకి అప్పగిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌బి) డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం డిస్మిస్ చేసింది. పోలీసు కస్టడీని సవాలు చేస్తూ ప్రణీత్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించలేమని జస్టిస్ జి.రాధారాణి స్పష్టం చేశారు. కేసు విచారణ దశలో ఉండగా తాము జోక్యం చేసుకోబోమని

తరువాయి 2లో

## తమిళనాడు గవర్నర్‌పై
# సుప్రీం సీరియస్

**పొన్ముడి విషయం 24 గంటల్లో తేల్చాలని ఆదేశం**




**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమిళనాడు మాజీ మంత్రి పొన్ముడిని తిరిగి మంత్రివర్గంలో చేర్చేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిరాకరించారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆయన కోర్టును ధిక్కరిస్తున్నారని హెచ్చరించింది. ఈ అంశంపై 24 గంటల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆదాయానికి

తరువాయి 2లో

## ఆర్థికంగా కాంగ్రెస్‌ను
# కుంగదీసే యత్నం

బ్యాంకు ఖాతాల స్తంభనపై సోనియా, ఖర్గే ఆగ్రహం

బిజెపి తీరు తమ పార్టీకేగాక, ప్రజాస్వామ్యానికే ప్రమాదమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** తమ బ్యాంకు ఖాతాలు స్తంభింపచేయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్‌ను ఆర్థికంగా కుంగదీసేందుకు ప్రధాని నరేంద్రమోడీ ఒక క్రమపద్ధతిలో ప్రయత్నాలు చేస్తున్నారని పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఆరోపించారు. తమ పార్టీ బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్‌ను మరింత ఉధృతం చేస్తామన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, పార్టీ సీనియర్ నాయకులు జైరామ్ రమేష్, ఎఐసిసి కోశాధికారి అజయ్ మాకెన్ తదితరులు మాట్లాడారు. తమ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ చేశారని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు తమ పార్టీకే కాదని మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. ప్రజలు పార్టీ కోసం ఇచ్చిన విరాళాలను వాడుకోకుండా చేయడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ చేయడంపై సోనియా గాంధీ తొలిసారి మీడియాతో మాట్లాడారు. బ్యాంకు ఖాతాల స్తంభన వల్ల తాము ఎలాంటి ప్రచారం పనులు చేయలేకపోతున్నామని, ఎన్నికల్లో పోరాడే తమ సామర్థ్యం దెబ్బతిన్నదని రాహుల్‌గాంధీ అన్నారు. అజయ్ మాకెన్ మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము ప్రచారం చేసుకోలేకపోతున్నామన్నారు. పోస్టర్లు వేయించడానికి వీలు లేని పరిస్థితులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కల్పిస్తోందని


తరువాయి 2లో

## ఫోన్ ట్యాపింగ్
# ప్రకంపనలు...

రోజుకో మలుపు తిరుగుతున్న విచారణ

ఇప్పటికే జిల్లాకు చెందిన ఇద్దరు సిఐల అరెస్టు

బిఆర్‌ఎస్ నాయకుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు




ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ కేసు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నది. పర్వతగిరిలో వార్ రూమ్‌ల ఏర్పాటు, విపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులే లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్ చేయడం అంశాలు సంచలనం సృష్టించాయి. ఈ వ్యవహారంలో మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావును అరెస్టు చేసి విచారణ జరుపుతుండడంతో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఫోన్ ట్యాపింగ్ అంశం ప్రస్తుతం బిఆర్‌ఎస్ నాయకుల చుట్టూ ఉచ్చు బిగిసేలా చేస్తున్నది. ముఖ్యంగా డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావుది వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం మేడిపల్లి కాగా, అతని అమ్మగారి ఊరు పర్వతగిరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బంధువు అన్న ప్రచారం జరుగుతుండడంతో బిఆర్‌ఎస్‌లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మరోవైపు ఎర్రబెల్లి స్వగ్రామం పర్వతగిరి కావడం, పర్వతగిరిలోనే వార్ రూమ్ ఏర్పాటు, ఫోన్ ట్యాపింగ్‌లు జరిగినట్లు పోలీసులు గుర్తించడం ఆరోపణలకు

తరువాయి 2లో

## మరో ఐదుగురు అభ్యర్థులకు కాంగ్రెస్ టికెట్

ప్రజాపక్షం / హైదరాబాద్



కాంగ్రెస్ పార్టీ తరుపున రాష్ట్రంలో లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థుల రెండవ జాబితా గురువారం విడుదలైంది. ఐదుగురు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ ఖరారు చేసింది. దీంతో ఇప్పటి వరకు తొమ్మిది స్థానాలలో అభ్యర్థులు ఖరారయ్యారు. పెద్దపల్లి అభ్యర్థిగా గడ్డం వంశీ, సికిందరాబాద్ నుంచి దానం నాగేందర్, మల్కాజ్‌గిరి నుంచి సునీతా మహేందర్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి డాక్టర్ మల్లు రవి, చేవెళ్ళ నుంచి గడ్డం రంజిత్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇంకా.. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. తాజాగా అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలోని కొన్ని స్థానాలకు మొత్తం 57 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రకటించిన జాబితాల్లో కాంగ్రెస్ 139 మంది అభ్యర్థులను ఖరారు చేసింది.

## డిమాండ్లు నెరవేరే వరకూ ఆందోళన కొనసాగిస్తాం

రైతు నేత సర్వన్‌సింగ్ పంధేర్ స్పష్టీకరణ



**చండీగఢ్ :** పంజాబ్, హర్యానా రెండు సరిహద్దు పాయింట్లలో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనను కొనసాగిస్తామని రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం సహా పలు డిమాండ్లను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ ముక్తి మోర్చా 'ఢిల్లీ చలో' ర్యాలీ నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రైతులను ఢిల్లీ వెళ్లనీయకుండా ఫిబ్రవరి 13న భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అప్పటి నుంచి శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్లలో పంజాబ్ రైతులు శిబిరాన్ని ఏర్పాటు చేసుకొని ఆందోళన చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేరేంత వరకు శాంతియుతంగా కొనసాగిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ నిరసనకు కోడ్‌తో సంబంధం లేదన్నారు. రైతులు, రైతు కూలీల ఎజెండాను ప్రజల ముందు ఉంచుతున్నామని చెప్పారు. కాగా, శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద హర్యానాకు చెందిన భద్రతా సిబ్బంది భారీ బారికేడింగ్‌తో మోహరించారు. ట్రాక్టర్ ట్రాలీలతో దేశ రాజధాని వైపు వెళ్లేందుకు బిజెపి ప్రభుత్వం అనుమతించకపోవడంపై


తరువాయి 2లో

# మైనర్ ప్రేమలు

**అబ్బాయికి 16, అమ్మాయికి 15**

**గర్భం దాల్చిన బాలిక**

ప్రజాపక్షం/ ఖమ్మం



కాలం మారుతుంది. జీవితం పైన కనీస అవగాహన లేకుండానే శారీరక సంబంధాల వైపు మైనర్లు పరుగులు పెడుతున్నారు. మారిన సామాజిక పరిస్థితులు, సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్ ద్వారా దిగుమతి అయిన కొత్త సంస్కృతి ఈ సంబంధాల వైపు ఊసిగోల్పేలా చేస్తుంది. కనీస అవగాహన లేకుండానే ఆకర్షితులవుతున్నారు. అది తల్లి దండ్రులకు గుదిబండలా మారడమే కాకుండా విలువైన జీవితాలు వికసించక ముందే మొగ్గల్లా వాడిపోతున్నాయి. అబ్బాయికి 16 సంవత్సరాలు, అమ్మాయికి 15 సంవత్సరాలు వారిరువురి మధ్య శారీరక సంబంధం వెరసి ఆ బాలిక గర్భవతి. ఆలోచించడానికే ఆందోళన కలిగించేలా ఉన్న ఈ విషయం వాస్తవం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ ఉన్నత పాఠశాలలో వెలుగు చూసింది ఈ ఘటన. ఈ ఘటనతో సమాజం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఇది ఈ ఒక్క పాఠశాలకో, గ్రామానికో పరిమితం కాలేదు. వెలుగు చూడని అనేక పాఠశాలల్లో ఈ మైనర్ జంటలు ఉన్నాయి. ఇప్పుడు దీనిని ఆపడం ఎలా. ఈ టీనేజీ ప్రేమలకు చెక్ పెట్టేదెలా అన్న

తరువాయి 2లో

## బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీ లో చేశారు. సిఎం నివాసంలో ఆయనకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు జెడ్‌పిటిసి సభ్యులు మురళీధర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ బాలు చౌహన్, జెడిసి నాయకులు అశోక్ కుమార్, మాజీ సర్పంచులు నూకల అభినవ్ రెడ్డి, బానోత్ రామ్ లాల్ తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే పరిస్థితులలో ఎన్నికల కమీషన్ లేదని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో సహా మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఉండే మూడు సభ్యుల ఎన్నికల కమిషన్‌లో ఏర్పడిన ఖాళీలను ప్రధానమంత్రి, అమిత్ షా, ప్రతిపక్ష నేత సభ్యులుగా వున్న ముగ్గురు సెలక్షన్ కమిటీలో ఇద్దరు బిజెపి వారే వున్నందున వారిచే నియమించబడిన ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే పరిస్థితిలో లేదన్నారు. దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదన్నారు. రమారమిగా ఒకే కాలంలో రష్యాలో, అమెరికాలో, భారత దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. భారతదేశంలో జరుగుతున్న ఎన్నికలలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇడిని, సిబిఐని, ఆదాయ పన్ను విభాగాలను వినియోగిస్తున్న తీరును చూస్తే ఇక్కడ పరిస్థితులు రష్యా, అమెరికాకు భిన్నంగా లేవని తెలుపుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తదనంతరం గురువారం ఆదాయ పన్ను అధికారులు దాడులు ప్రతిపక్ష నాయకులపై జరగడం, కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి దురుద్దేశ్యానికి నిదర్శనమన్నారు.

## టెన్త్ పరీక్షల పేపర్ లీకేజీ అవాస్తవం

ప్రజాపక్షం/హైదరాబాద్ : టెన్త్ పరీక్షల పేపర్ లీకేజ్‌పై వివిధ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలలో 19వ తేదీన నిర్వహించిన 2వ భాషా పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని, అదే విధం గా 20వ తేదీన పది ప్రశ్నాపత్రం బయటకు వచ్చింది అని జరిగిన ప్రచా రం కూడా అవాస్తవమని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఈసంఘటనపై చేసిన విచారణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని తేలింది.

## ఎన్ఐఎ కేసు నిందితులకు బెయిల్

హైదరాబాద్ : ఒక మతానికి చెందిన వాళ్లకు చట్ట వ్యతిరేక శిక్షణ ఇస్తున్నారంటూ ఎన్ఐఏ నమోదు చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులు మహ్మద్ అబ్దుల్ మోబీన్ మొబిన్, షేక్ రహీం అలియాస్ అబ్దుల్ రహీం, షేక్ వహీద్ అలి అబ్దుల్ వహీద్. షేర్ ప్రలాబాన్, షేక్ ప్రొదుల్లా, మహ్మద్ ఉస్మాన్, ఫిరోజాన్, షేక్ రియాజ్ అహ్మద్లలకు బెయిల్ మంజూరు చేసింది. ఈమేరకు జస్టిస్ కే లక్ష్మణ్ ఉత్తర్వులు చేశారు. కర్నూలు తదితర ప్రాంతాల్లో ఒక మత యువతకు శిక్షణ ఇచ్చారనే కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. వాళ్లకు బెయిల్ మంజూరు చేసేందుకు నాంపల్లి ఎన్ఐఏ కోర్టు నిరాకరించింది. దీంతో వాళ్లంతా వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేయడంతో హైకోర్టులో బెయిల్ లభించింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్లతో పాటు అంతే మొత్తానికి మరో ఇద్దరు పూచీకత్తులు సమర్పించాలని, తిరిగి ఉత్తర్వులు జారీ చేసేదాకా సంబంధిత పోలీసు స్టేషన్లలో ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోగా హాజరుకావాలని, సాక్షులను ఏవిధంగానూ బెదిరించరాదని, ప్రలోభాలకు గురిచేయరాదని, పాస్‌పోర్టులను కింది కోర్టులో స్వాధీనం చేయాలని, కేసు విచారణకు సహకరించాలని షరతులు విధించింది. .. అని షరతులు విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## బాండ్ల వివరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌బిఐకి స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్‌బిఐ బాండ్ల వివరాలను సమర్పించగా, ఇసిఐ ఆ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ప్రకటించింది. మొత్తం మీద ఎలక్టోరల్ బాండ్ల పథకం రద్దుకావడంతో పాటు, ఎవరు, ఎవరి కోసం, ఎంత మొత్తంలో బాండ్లు కొన్నారు? అందుకు ప్రతిఫలంగా వారికి ఏం లభించింది? అనే వివరాలు వెలుగు చూడనున్నాయి. ఈ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపి అత్యధికంగా లబ్ధి పొందిన విషయం విదితమే.

## ప్రచారానికి ఇసిఐ బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్వయంగా నిర్వహిస్తున్నది. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వ పరంగా ఇలాంటి ప్రచారాలు అభ్యంతరకరమని ఇసిఐ స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం, వాట్సాప్ ద్వారా వికసిత్ భారత్ సందేశాలను పంపించడాన్ని వెంటనే నిలిపివేయాలని, ఈ విషయంపై వెంటనే కాంప్లయన్స్ రిపోర్టు ఇవ్వాలని ఇసిఐ తన ఉత్తర్వుల్లో ఆదేశించింది.

## ప్రణీత్ రావు పిటిషన్ డిస్మిస్

(మొదటి పేజీ తరువాయి)

తీర్పులో పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో సరైన సదుపాయాలు లేవని, విచారణ పూర్తయ్యాక జైలుకు పంపేలా ఆదేశాలు జారీ చేయలేమని తెలిపారు. మరో రెండు రోజుల్లో పోలీసుల కస్టడీ ముగుస్తుందని, ఈ దశలో పోలీసుల విచారణకు అవరోధం కలిగించేలా కస్టడీ ఉత్తర్వులను నిలుపుదల ఆదేశాలు ఇవ్వలేమని తెలిపారు. 'ఉదయం 8 నుంచి రాత్రి 8 దాకా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కేవలం కార్యాలయాల పనివేళల్లో మాత్రమే విచారించేలా ఆదేశాలు ఇవ్వాలి. ఏకంగా 12 గంటలపాటు విరామం లేకుండా విచారణ చేయడం చట్ట వ్యతిరేకం. పోలీసుల దర్యాప్తులోని అంశాలను మీడియాకు లీకులు చేస్తున్నారు. లీక్‌ల ద్వారా తనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మీడియాకు లీకులు లేకుండా చూడాలి. న్యాయవాది. బంధువులను కలవనివ్వడంలేదు. రెండు రోజులకోసారి వైద్యపరీక్షలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలి' అని ప్రణీత్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది.

# రైస్ మిల్లర్లపై విజిలెన్స్ నజర్



### కూపీ లాగుతున్న అధికారులు
### అనుమతులు లేకుండా లీజు
### ప్రభుత్వాదాయానికి కోట్లలో గండి
### అధికారులకు తప్పుడు సమాచారం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని రైస్ మిల్లుల వ్యవహారాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొంతమంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రైస్ మిల్లులను లీజుకు నడిపిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఆరా తీస్తున్నారు. వారి ఆరాలో నిజమని తేలితే చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

### జిల్లాలో 37 మిల్లులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 37 రైస్ మిల్లులున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రెండు సీజన్లలో కేటాయిస్తుంటారు. నిబంధనల ప్రకారాం ఎఫ్‌సిఐకి ధాన్యాన్ని లెబీ క్రింద అందిస్తుంటారు. ఈ కేటాయింపులు పౌరసరఫరాలశాఖ ఆదీనంలో నడుస్తుంటాయి. జిల్లాలో కొందరు రైస్ మిల్లర్లు నడిపించలేని పరిస్థితుల్లో ఇంతరులకు లీజు పేరిట అప్పగిస్తున్నారు. ఇలా లీజుకు ఇచ్చిన మిల్లులు సుమారు 20వరకు ఉండవచ్చని తెలుస్తోంది.

### అనుమతులు లేకుండానే లీజులు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 37 రైస్ మిల్లులో సుమారు 15 నుండి 20 వరకు లీజుకు నడుస్తున్నట్లు తెలుస్తోంది. లీజుకు తీసుకున్న వారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రైస్ మిల్లులు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు లీజు వ్యాపారులు మిల్లర్ల పేరుమీదే ధాన్యాన్ని తీసుకుంటూ ఆడించి ఎఫ్‌సిఐకి పంపుతున్నారు. వాస్తవానికి రైస్ మిల్లులు లీజుకు తీసుకున్న ప్రాసెసింగ్ లైసెన్స్‌తో పాటు ప్రర్చేస్ లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. లీజుకు తీసుకున్న వారిలో గత కొంత కాలంగా ఎలాంటి లైసెన్సులు తీసుకోకుండానే పనికానిచ్చేస్తున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్సు తీసుకోవడంతో పాటు ఫీజులు చెల్సించాలి. కానీ జిలాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా కొన్నేళ్లుగా మిల్లులు నడుస్తుండటంతో మార్కెటింగ్ శాఖకు రావాల్సిన కోట్లాది రూపాయాల ఆదాయానికి గండిపడుతోంది. సంబంధిత శాఖకు సంబంధంచి మార్కెట్ కమిటీ పరిధిలో లీజుకు తీసుకున్న వారు. తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. ప్రాసెసింగ్ క్రింది లీజుకు తీసుకుని నడిపే వారు. రూ.1లక్ష లైసెన్సు ఫీజు తప్పని సరిగా చెల్లించి మూడేళ్ల అనుమతి పొందాలి. మరో ప్రక్క పర్చేస్ లైసెన్సు క్రింద రూ.3 లక్షలు చెల్లించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యజమానుల పేరుతో లీజుదారులు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

### విజిలెన్స్‌కు తప్పుడు సమాచారం

రైస్ మిల్లుల లీజు వ్యవహారాల్లో మార్కెటింగ్ శాఖ విజిలెన్స అధికారులకు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. అతా సవ్యంగానే ఉన్నాయని నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచారం. మరో ప్రక్క లీజులు తీసుకున్నప్పటికీ ఎక్కడా బయటకు పొక్కకుండా మిల్లు యజమానులు, లీజుదారులు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 15 నుండి 20 మిల్లులు ఎలాంటి లీజు అనుమతులు లేకుండా నడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం అని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటు మిల్లర్లు, అటు లీజు దారుల నుండి ఒక్కొక్క మిల్లు నుండి భారీగా ముడుపులు తీసుకుని లీజులే లేవంటూ సంబంధిత మార్కెటింగ్ శాఖాధికారులు చెప్పుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే సమాచారాన్ని మీడియా అడిగినప్పటికీ అంతా సవ్యంగానే ఉన్నాయంటూ దాటవేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు మార్కెటింగ్ శాఖ ఇచ్చే వివరాలతోనే సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే పలువురి భాగోతాలు బయటకు వస్తాయని, దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

## ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తనకు కొడంగల్, మల్కాజిగిరి రెండు నియోజకవర్గాలు రెండు కళ్ల లాంటివన్నారు. కొడంగల్‌కు ఏ విధంగా ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నామో, అంతే సమానంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జీలకు, ముఖ్య నాయకులకు డిసిసి అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పది మందితో కూడిన కమిటీ వేయాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులందరికీ ఏదో ఒక విధంగా పదవులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన నాయకులకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి పదవులు కూడా ఉన్నాయన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కిగౌడ్, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి, పట్నం సునీతారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, రంగరెడ్డి డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, తదితరులు ముఖ్యనాయకులు హాజరయ్యారు.

## ఇన్‌చార్జి డిఎంఇ జిఒ సస్పెన్షన్

### రెగ్యులర్ డిఎంఇని నియమించాలన్న హైకోర్టు

హైదరాబాద్ : మెడికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జి డైరెక్టర్‌గా(డిఎంఇ) డాక్టర్ ఎన్.వాణి నియామక జీవో 63 అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్‌రూల్స్10(హెచ్)కు, 2017లో హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్లకు వ్యతిరేకంగా జీవో ఉందని తేల్చింది. చట్ట ప్రకారం రెగ్యులర్ డీఎంఈని నియమించాలని ప్రభుత్వానికి ఉత్తర్వులిచ్చింది ఈ మేరకు జస్టిస్ పుల్లా కార్తీక్ మధ్యంతర ఆదేశాలిచ్చారు. ఇంచార్జి డీఎంఈగా డాక్టర్ వాణిని నియమిస్తూ ఫిబ్రవరి 19న ప్రభుత్వం జీవో 63ను జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జనవరి 25న జారీ చేసిన ఏడీఎంఈల ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా ప్రకారం డాక్టర్ కె శివరామప్రసాద్ టాప్‌లో ఉన్నారని, వాణిని నియమించడం చెల్లదని లాయర్ కృష్ణయ్య వాదించారు. వాదలన తర్వాత హైకోర్టు జీవో 63ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

## కన్నారావు పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్ : భూకబ్జా, హత్యాయత్నంపై ఆదిభట్ల పోలీసు స్టేషన్లో నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీసిఎం కె.చంద్రశేఖర్‌రావు అన్న కొడుకు కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్ రావు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది మన్నెగూడ వద్ద రెండెకరాల ప్రైవేటు భూమిని కన్నారావు మరో 30మందితో కలిసి కబ్జా చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలపై ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ బండోజు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. తమపై రాజకీయ కక్షలతో వేధింపులకు దిగుతున్నారని, కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన జస్టిస్ కె.సుజన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక ఆధారాలున్నందున ఈ దశలో కేసును కొట్టేయలేమని పేర్కొన్నారు. దర్యాప్తు చట్టప్రకారం జరగాలని పోలీసులను ఆదేశిస్తూ, కన్నారావు పిటిషన్ కొట్టివేశారు.

## ఆందోళన కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పంధేర్ మండిపడ్డారు. మా డిమాండ్లను అమలు చేయించుకునేందుకు ఢిల్లీ వెళ్లడానికి మమ్మల్ని ఎందుకు అనుమతించడం లేదని ఆయన ప్రశ్నించారు. అమృత్‌సర్, జండియాలా, బియాస్ నుండి అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు సరిహద్దు పాయింట్లకు బయలుదేరారని పంధేర్ చెప్పారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో రైతులు తమ ఇళ్ల నుంచి ఫ్యాన్లు, ఇతర వస్తువులను సరిహద్దు పాయింట్లకు తీసుకొచ్చారన్నారు. ఇదిలా ఉండగా, ఫిబ్రవరి 13న రైతులు తమ ర్యాలీని ప్రారంభించారు. కానీ భద్రతా బలగాలు అడ్డుకున్నాయి, ఇది హర్యానా, పంజాబ్ సరిహద్దులోని శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద ఘర్షణలకు దారితీసింది. ఫిబ్రవరి 21న పంజాబ్‌హర్యానా సరిహద్దులోని ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద జరిగిన ఘర్షణల్లో భటిండాకు చెందిన శుభకరన్ సింగ్ (21) అనే రైతు మరణించగా, 12 మంది పోలీసులు గాయపడ్డారు. నిరసన తెలుపుతున్న కొందరు రైతులు బారికేడ్ల వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, రాష్ట్ర సరిహద్దు దాటి ఢిల్లీకి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో ఈ ఘటన జరిగింది.

## సేవ్ డెమోక్రసీ డేగా.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అమరవీరుల దినోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మార్చి 23న భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల అమరవీరుల దినోత్సవాన్ని సేవ్ డెమోక్రసీ దేగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర పాలకులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, అమరవీరులకు నివాళులు అర్పించడం, సభలు, సమావేశాల నిర్వహణతో పాటు నిరసన కార్యక్రమాలను జరపాలని ఎస్‌కెఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్లు పశ్య పద్మ, టి. సాగర్, వి. ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, కొండల్, పెద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య, ప్రమీల, నాగిరెడ్డి, బాల్ మల్లేశ్, ఆర్. వెంకట్రాములు, రామకృష్ణ, గోనె కుమారస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బిజెపిని ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎస్‌కెఎంతో పాటు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, వృత్తి, ఆదివాసీ, గిరిజన, సామాజిక, మైనారిటీ సంఘాలు భాగస్వామ్యులు కావాలని వారు కోరారు.

## మైనర్ ప్రేమలు

ఆలోచన మొదలైంది. రెండు రోజుల క్రితం ఈ ఘటన వెలుగు చూసినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. మండల కేంద్రంలోని ఓ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ ఘటన నిజం కాకపోతే బాగుండుననిపించింది. కానీ నిజమేనని తెలిసి అవగాహన ఉన్న ప్రతి ఒక్కరు ఈ ప్రమాదం నుంచి యువతను మరల్చాలన్న ఆలోచనకు వచ్చారు నిజమే. ఒకప్పుడు సినిమాలు యువతపై ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు సినిమాలకు దూరంగా తమ బిడ్డలను పెంచాలని భావించే వారు. చాలామంది ఆ విషయంలో కృతకృత్యులయ్యారు. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ నెట్టింట్లోనే చిచ్చుపెట్టింది. మనింట్లో ఉండే ఏమి చూడాలనుకుంటున్నారో అవి చూస్తున్నారు. తద్వారా వారి ఆలోచనలు మారిపోతున్నాయి. కరోనా పుణ్యమా అని ఆన్‌లైన్ పాఠాలు అంటూ పసి ప్రాయంలోనే సెల్ ఫోన్ చూడక తప్పనిస్థితి ఏర్పడింది. ఇప్పుడు అది ఒక వ్యసనంగా మారింది. సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఆత్మహత్యలు చేసుకున్న వారు సైతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. తెలిసి తెలియని వయస్సులో సెల్‌ఫోన్‌లోని చిత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని ఆ సంభాషణలు వింటూ తమ శరీర వాంఛలను అప్పుడే తీర్చుకోవాలని తొందరపడుతున్నారు. వాట్సాఫ్, ఫెస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, స్నాప్‌చాట్ తదితరమైన యాప్‌లు వీరి పాలిట శాపాలుగా మారాయి. ఆ క్రమంలోనే వారిద్దరి మధ్య ఏర్పడిన శారీరక సంబంధం ఆ బాలికను దోషిగా నిలబెట్టి తల్లిదండ్రులను తలవంచుకునేలా చేసింది. తమ ఇంట్లో కూడా ఇలాంటిదే జరుగుతుందని తెలుసుకోలేని చాలామంది ఆ బాలిక తల్లిదండ్రులను వేలెత్తి చూపుతున్నారు. భవిష్యత్ తరాన్ని ఆ యాప్‌లు మింగేస్తున్నాయి. తల్లిదండ్రులు సైతం ఫోన్‌లోనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఫోన్ చూసుకుంటూనే వంట, ఫోన్ చూసుకుంటూనే పని, ఫోన్ చూసుకుంటూనే పలకరింపులు అంతా ఫోన్‌లోనే ముఖం పెట్టందే ఏమి చేయలేని స్థితి. పిల్లలతో రోజు ఓ గంట పాటు గడపలేని తల్లిదండ్రులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగమానదు. మన పిల్లలకు బాక్స్ కట్టడం, బడికి పంపడం, ఫీజులు కట్టడం, ఖర్చులకు డబ్బులు ఇవ్వడమే కాదు ఇంకా మనమివ్వాల్సింది చాలా ఉందన్న విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించలేక పోవడమే ఈ పరిస్థితి కారణమవుతుంది. కౌమార్య దశలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే ముమ్ముందు ఎలా ఉంటుందోనన్న ఆందోళన, భవిష్యత్ యువత ఈ సమాజాన్ని ఏవైపుకు తీసుకుపోతుందోనన్న భయం చాలామందిలో ఉంది. సెల్‌ఫోన్ ప్రపంచాన్ని నడిపిస్తుంది, సమాచారాన్ని అందిస్తుంది. అదే సమయంలో జీవితాన్ని శాసిస్తుంది. ఆ సెల్‌ఫోన్ జీవితం నుంచి తమ పిల్లలను బయటకు తీసుకు రావాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. లేదంటే ఇప్పుడు పదో తరగతి బాలికకు గర్భం అన్న మాటను విన్నాం ఇక ముమ్మందు ఏమి వినాల్సి వస్తుందో.

## సుప్రీం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో డిఎంకె నేత, మాజీ మంత్రి పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షికి మద్రాసు హైకోర్టు గతంలో జైలు శిక్ష విధించింది. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటు పడింది. అనంతరం ఈ జైలుశిక్షను సుప్రీంకోర్టు నిలిపివేయడంతో ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతారని తమిళనాడు స్పీకర్ ఇటీవల ప్రకటించారు. ఈ క్రమంలోనే పొన్ముడిని మళ్లీ మంత్రిగా పదవీప్రమాణం చేయించాలని సిఎం స్టాలిన్ రాష్ట్ర గవర్నర్‌కు సిఫార్సు చేశారు. ఇందుకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిరాకరించారు. జైలు శిక్షపై స్టే మాత్రమే వచ్చిందని, ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవడం రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని పేర్కొన్నారు. దీంతో స్టాలిన్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. గవర్నర్ తీరుపై సిజెఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'గవర్నర్ వ్యవహార శైలి చాలా ఆందోళనకరంగా ఉంది. ఆయన సుప్రీం కోర్టును ధిక్కరిస్తున్నారు. ఇలా చేయడం తగదు. అడ్వైజర్లు ఆయనకు సరిగా సలహాలు ఇవ్వట్లేదు. శిక్షపై మేం స్టే ఇచ్చామంటే.. అది నిలిచిపోయినట్లే. ఒక వ్యక్తి/మంత్రిపై మనకు విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు. కానీ, పదవిలో ఉన్నప్పుడు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిందే. 24 గంటల్లోగా ఈ అంశాన్ని గవర్నర్ తేల్చాలి. లేదంటే మేమే ఉత్తర్వు లు జారీ చేయాల్సి ఉంటుంది'' అని ధర్మాసనం హెచ్చరించింది.

## ఉనికికే ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. భారతదేశం లౌకిక దేశమని సకల భాషలు, సకల జీవన విధానాలు, అనేక మతాలు, అనేక కులాలతో కలిసి భిన్నత్వంలో ఏకత్వంగా జీవించే భారతదేశంలో కులం మతం పేరుతో చిచ్చు పెట్టి ప్రజల మధ్య విభజన రేఖను గీసి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న మోడీ ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలను కొనసాగించబోమని ఈ అంశంపై పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని వారు ప్రకటించారు. ఇది కేవలం ఒక ముస్లిం మైనారిటీలకు సంబంధించిన అంశమే కాదని, ఇది మొత్తం భారతదేశానికి సంబంధించిన విషయమని, ఇందులో దేశాన్ని ప్రేమించే ప్రతి పౌరుడు స్పందించి ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ ఫ్యూడల్ భావజాల విధానాన్ని తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సంశుద్దీన్, హైకోర్టు అడ్వకేట్ అఫ్జల్ ఖాసిం, ఉజ్మ షకీర్ తైమస్, నదీమ్, ఎండి.యూసుఫ్, ఎండి.రుక్మత్, పెద్ద సంఖ్యలో మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ట్యాపింగ్ ప్రకంపనలు...

(మొదటి పేజీ తరువాయి)

బలం చేకూరుస్తున్నది. దయాకర్‌రావు, దుగ్యాల ప్రణీత్ రావు ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఇద్దరి మధ్య బంధుత్వం ఉందన్న ప్రచారం జరిగింది. దీనిపై ఇటీవల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ డిఎస్‌పి ప్రణీత్ రావుతో తనకు ఎలాంటి సంబంధాలు లేవని ప్రకటించారు. ఈ క్రమంలో ఎర్రబెల్లి పార్టీ మారుతున్నారన్న ప్రచారం జరిగింది. రక్షణ కోసమే ఎర్రబెల్లి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిలోకి వెళ్లనున్నారన్న ప్రచారం నేపథ్యంలో ఎర్రబెల్లి ప్రెస్ మీట్ పెట్టి మరీ తాను బిఆర్ఎస్‌ను వీడడం లేదని, పార్టీ మారడం లేదని ప్రకటించాల్సి వచ్చింది. తనపై ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎర్రబెల్లి విమర్శించారు. ఈ విషయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఖండించినప్పటికీ ఆయనపై జరుగుతున్న ప్రచారానికి బ్రేక్ పడేలా కనిపించడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విపక్ష రాజకీయ నాయకుల, నియోజకవర్గంలోని తన ప్రత్యర్థుల ఫోన్లను ట్యాపింగ్ చేసి ఎప్పటికప్పుడు వారి కదలికలను ప్రణీత్ బీఆర్ఎస్ పెద్దలకు, ముఖ్యంగా మాజీ మంత్రి ఎర్రబెల్లికి చేరవేసి ఉంటారన్న ప్రచారం జరుగుతున్నది. కాగా పనిలో పనిగా స్వామి కార్య స్వకార్యం నెరవేర్చుకునే పనిలో పడిన ప్రణీత్ రావు పలువురు వ్యాపారుల, కాంట్రాక్టర్ల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు, వారి కదలకలను, కార్యకలాపాలను కనిపెట్టేందుకు ఫోన్‌కాల్స్ రికార్డు చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ వ్యవహారంలో మాజీ డిఎస్‌పికి సహకరించిన ఇద్దరు వరంగల్ జిల్లాకు చెందిన సిఐలను కూడా విచారణ సందర్భంగా హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏఏ రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్ రికార్డు చేశారో, ఏ కాంట్రాక్టర్,వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేశారోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. హైదరాబాద్‌లో ఎస్ఐబి కార్యాలయంతో పాటు వరంగల్ జిల్లాలోని పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేయడం, దుగ్యాల ప్రణీత్ జిల్లాకు చెందిన వాడు కావడంతో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ పై ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దృష్టి పడింది. ఈ కేసులో కీలకమైన ప్రణీత్‌రావుతో పాటు ఇద్దరు సీఐలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారే కావడంతో వరంగల్ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ నడుస్తున్నది. రానున్న రోజులలో విచారణలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

## కుంగదీసే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజలకు తమకు మద్దతు ఇవ్వాలని అజయ్ మాకెన్ కోరారు. బిజెపితో సహా ఏ రాజకీయ పార్టీ ఆదాయపు పన్ను చెల్లించనప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ఆయన ప్రశ్నించారు. సామాన్య ప్రజలు తమ పార్టీకి ఇచ్చిన విరాళాలను బిజెపి లూటీ చేస్తుందని, తమ ఖాతాల నుంచి బలవంతంగా రూ. 115.32 కోట్లు విత్‌డ్రా చేసుకుందని ఆరోపించారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేసి ప్రధాని, హోంమంత్రి కాంగ్రెస్‌పై క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారని రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలమన్నారు. ఎవరిదైనా బ్యాంక్ అకౌంట్ మూసివేసినా, ఎటిఎం కార్డు పని చేయకుండా చేస్తే జీవించగలరా.. ప్రస్తుతం తాము ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండా బిజెపి కుట్రకు పాల్పడిందన్నారు. ఎన్నికలకు 2 నెలల ముందు ఇలా చేయడం వల్ల కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బిజెపి ఉద్దేశంగా కనిపిస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించాల్సిన సంస్థలు ఉన్నాయి కానీ, ఏమీ చేయడం లేదని సోనియాగాంధీ మండిపడ్డారు. అన్నారు. ప్రస్తుతం తలెత్తిన సమస్య చాలా చాలా తీవ్రమైనదని, ఇది కాంగ్రెస్‌పైనే కాకుండా మన ప్రజాస్వామ్యంపైనే ప్రాథమికంగా అత్యంత ప్రభావం చూపుతుందన్నారు. కాంగ్రెస్‌ను ఆర్థికంగా కుంగదీయడానికి ప్రధాని ఒక క్రమబద్ధమైన ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల నుండి సేకరించిన నిధులు స్తంభింపజేసి తమ ఖాతాల నుండి డబ్బును బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. అయితే, ఈ అత్యంత సవాలు పరిస్థితులలో కూడా, ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసిందని ఆరోపించారు. అధికార పార్టీ వైఖరి ఎంతో ప్రమాదకరమన్నారు. బిజెపి వేల కోట్ల రూపాయిలు విరాళాలుగా తీసుకుని.. కేవలం మా బ్యాంకు ఖాతాలను ఎందుకు స్తంభింపజేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆదర్శాలకు భారత్ పేరు గాంచిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన విషయం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిష్పక్షపాతమైన ఎన్నికలు తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరికీ సమానమైన అవకాశాలుండాలని ఖర్గే పేర్కొన్నారు. మోడీ పాలనలో భారతదేశ ప్రతిష్ట దిగజారుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడం ద్వారా ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓ రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డంకులు సృష్టించడం సరికాదని.. ఖర్గే అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా బిజెపి ప్రకటనలే కనిపిస్తున్నాయి. తమ బ్యాంకు ఖాతాలు స్తంభపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.

# 'పవర్ షట్ డౌన్'కు కుట్ర

సమర్థవంతంగా అధిగమించాం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జర్నలిస్టులతో ఇష్టాగోష్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాను సిఎం అవుతానని తప్పుడు ప్రచా రం చేస్తున్నారని, పార్టీలో తాను జూనియర్‌నని, కొంద రు దురుద్దేశంతోనే తాను బిజెపిలోకి వెళ్తున్నట్టు ప్రచారం చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రాష్ట్రంలో 'పవర్ షట్ డౌన్' చేసేందుకు కుట్ర పన్నారని, దీనిని తాము అధిగమించామన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లోని టూరిజం హోటల్‌లో జర్నలిస్టులతో గురువారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వర్షకాలంలోనే నీటి నిల్వలను గత ప్రభుత్వం నింపకుండా, తమపై రాళ్లు వేసేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే నీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని వివరించారు. కొంత సాగు నీటి సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని, తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు అవసరమైతే డెడ్ స్టోరేజీ నుండి నీటిని తీసుకొస్తామని వివరించారు. మేడిగడ్డ విషయంలో బాధ్యులను వదలబోమన్నారు. ధరణి ద్వారా జరిగిన అక్రమాలన్నింటినీ ఆధారాలతో బయటపెట్టి, శ్వేతపత్రం విడుదల చేస్తామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం ధరణిని రహస్య డాక్యుమెంట్‌గా చూసిందని, తమ ప్రభుత్వం ఏదీ దాచి పెట్టబోదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సమస్య నుంచి బయటపడ్డామని, మంచినీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసే ప్రసక్తే లేదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో చర్చించి జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో బిఆర్‌ఎస్‌కు ఒకటో, రెండో సీట్లు వస్తే అదే గొప్ప అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ అవినీతిని చక్కదిద్ది వ్యవస్థను దారిలో పెడుతున్నామన్నారు. పక్కదారి పట్టిన సొమ్మంతా కక్కిస్తామన్నారు. కేంద్రంలో అనవసరంగా వివాదానికి వెళ్లబోమని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పనుల అంశంలో కేంద్రాన్ని కోరతామని, అవసరమైతే పోరాడేందుకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందేనన్నారు. సెక్యూలర్ పార్టీలతో కలిసి తాము ముందుకెళ్తామన్నారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి రమ్మని తాము ఎవ్వరినీ ఆహ్వానించడం లేదని, వారి కి వారే స్వచ్ఛందంగా వస్తున్నారని వివరించారు. తాము గేట్లు ఎత్తలేదని, ఎత్తితే వరద ఆగబోదని చెప్పారు. తాము చెప్పిందే చేస్తున్నామని, గత పాలకుల అవినీతి పైన పోరాడుతూనే. డిస్టర్బ్ అయిన వ్యవస్థను దారిలో పెడుతున్నామన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్ దాస్ మున్షి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కిగౌడ్ సమక్షంలో బిఆర్‌ఎస్‌కు చెందిన హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ గాంధీభవన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్‌తో పాటు నాయకులు వేములయ్య గౌడ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వందరోజుల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారన్న నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు.



## నూతన జాతీయ విద్యావిధానం రద్దుచేయాలి : డాక్టర్ గోపీనాథ్




**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** జాతీయ నూతన జాతీయ విద్యావిదానం 2020ను రద్దు చేయాలని భారత్ బచావో వైస్‌చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ అన్నా రు. గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం బాటనీ విభాగంలో కేయూ విద్యార్థి నాయకులు కామగోని శ్రావణ్, మున్నా గణేష్, ఉప్పుల శివల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డాక్టర్ గోపీనాథ్ ముఖ్యవక్తగా పాల్గొని మా ట్లాడారు. నూతన జాతీయ విద్యావిదానం 2020 వల్ల బడుగు బలహీన వర్గాలకు విద్య దూరమవుతుందని, వేల ఏళ్ల నాటి మను స్మృతిని అమలు చేయడం కోసమే ఈ విద్యా విదానాన్ని ప్రవేశపెడుతున్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు నూతన జాతీయ విద్యావిదానం 2020ను నిరసిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థులు దీనిని తిప్పికొట్టాలని ఆయన కోరారు. మరో వక్తగా విచ్చేసిన రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ మాట్లాడుతూ అరువై ఆరు పేజీల నూతన జాతీయ విద్యావిదానం 2020లో సామాజిక న్యాయమనే మాటే లేదని అన్నారు. విద్యను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ వక్తులకు అప్పగించడమే నూతన జాతీయ విద్యావిదానం 2020 లక్ష్యమని అన్నారు. అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే,పెరియార్ లాం టి మహనీయుల ఆలోచనలకు భిన్నంగా నూతన జాతీయ విద్యావిదానం ఉం దన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో నాయకులు ఎం.వెంగళ్ రెడ్డి,రిటైర్డ్ టీచర్ గోపాల్ రెడ్డి, సత్యం, అనిల్, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మాడిశెట్టి గోపాల్‌కు తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కవి, రచయిత, వ్యాఖ్యాత, సాహిత్యసాంస్కృతిక సంస్థల నిర్వాహకుడు మాడిశెట్టి గోపాల్ 'సాంస్కృతిక సంస్థల నిర్వహణ అంశం'లో తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో గురువారం జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జుడిషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్,విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగడ కిషన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాడిశెట్టి గోపాల్‌కు పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి,రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్, సాహితీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. చైతన్య కళాభారతి నాటక సంస్థలో భాధ్యునిగా, తెలంగాణ స్థాయి నాటక పోటీలను గోపాల్ నిర్వహించారు. సమైక్య సాహితి సాహితీ గౌతమి సంస్థల అధ్యక్షునిగా అసంఖ్యాకమైన కార్యక్రమాలు గతంలో నంది టీవీ పురస్కారాల కమిటీ జూరీ మెంబర్‌గా, కరీంనగర్ ఎన్ ఆర్ఐ ఫోరం కరీంనగర్ వికాస వేదిక కోఆర్డినేటర్ గా, అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) తరపున పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆయన పలు రాష్ట్ర స్థాయి పురస్కారాలను, ప్రశంసలు పొందారు.

## కాంగ్రెస్‌లో చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలో చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బిఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు మెల్లమెల్లగా ''గులాబీ'కి రాజీనామా చేస్తున్నారు. తాజాగా బిఆర్‌ఎస్‌కు చెందిన ముథోల్ మాజీ ఎంఎల్‌ఎ విఠల్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## మాట ఇచ్చిన ప్రభుత్వమే ప్రజలను మోసం చేసింది

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ :** ప్రభుత్వమే మాట ఇచ్చిన ప్రజలను మోసం చేసిన ఘటన చరిత్రలో ఏనాడు లేదని, మాట ఇచ్చిన రైతన్నల నడ్డి విరిచిన అపకీర్తి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్‌ఎ గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. ఎండిపోయిన పంటలను పరిశీలించాలని రైతన్నల కన్నీటి ఆహ్వానం మేరకు గురువారం మండలంలోని యార్కారం, దుబ్బతండ, రెఖ్యానాయక్ తండాలో ఆయన ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతుల ఇబ్బందులను చూసి చలించి పోయారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎంఎల్‌ఎ జగదీష్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఎస్‌ఆర్‌ఎస్‌పి ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారని హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతాంగాన్ని మోసం చేసిందని విరుచుకుపడ్డారు. ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు రూ.25వేల నుండి 30వేల పెట్టుబడి పెట్టి ఆగమయ్యారన్నారు. ప్రభుత్వం అవగానరాహిత్యం వలన రైతులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. మా ప్రభుత్వం హాయాంలో మొన్నటి వరకు జాలువారిన పంట పొలాలు నేడు మోడువారడానికి కారణం నూటికి నూరుశాతం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో కెసిఆర్ రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తే మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగంచేసిందన్నారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడానికి మూడు ఫిల్లర్లు కుంగుబాటుకు సంబంధం లేనప్పటికి గత ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు రైతాంగానికి నీళ్లు ఇవ్వడం లేదన్నారు. రైతుబంధు రాలేదని ప్రశ్నించిన రైతును మంత్రి చెప్పు తీసుకుని కొడతాననడం దుర్మార్గమన్నారు. మా ప్రభుత్వం హయాంలో రైతు తప్పిదం వలన ఒక్క మడి ఎండిపోతేనే నాన్న హంగామా చేసిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట పొలాలు ఎండి పోతున్నప్పటికి మంత్రులు కనీసం సమీక్ష చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న మొసలి కన్నీళ్లకు నిదర్శనమన్నారు. పంట నష్టంపై మంత్రివర్గం సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సమర్థవంతంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే, అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు. ఆ యా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో ప టిష్ట నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.

### ఇప్పటి వరకు రూ. 10 కోట్లు సీజ్..

రాష్ట్రంలో ఇప్పటికీ వివిధ శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. వీటిలో పోలీస్ శాఖ ద్వా రా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు పోలీస్ శాఖ ద్వారా రూ.10 సీజ్ చేశామన్నారు. లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. రవాణ శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ చెక్‌పోస్టులు 24 గంటలు పనిచేస్తాయన్నారు. రవాణ శాఖ బృందాలు జరిపిన తనిఖీలలో రూ. 34.31 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాణిజ్య పన్నులశాఖ ద్వారా 16 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు 31 వ్యూహాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వివరించారు.

### అన్ని వ్యవస్థలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను పంపిణీ చేసేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 141 గోదాములు, 912 వివిధ వ స్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా పెట్టామన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించామన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మద్యం అక్రమ రవాణకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి, వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.50 లక్షల విలువైన మద్యాన్ని స్వా ధీనం చేసుకున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, సిసిటివిలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు వివరించారు. హైదరాబాద్‌లోని పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి కూడా మద్యం రవాణపై సిసిటివిల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పో స్టులు ఏర్పాటు చేయగా, వాటిలో 18 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఫీజిబులిటీ రిపోర్ట్‌కు కేంద్రం ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మించిన రెండవ దశ ఫీజిబులిటీ రిపోర్ట్‌కు కేంద్రం ఆమోదించిందని సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ తెలిపారు. విద్యుత్‌ను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ ఇప్పటి వరకు పిపి ఎ చేయలేదని ఎన్‌టిపిసి తెలియజేసిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016–17లో ఎన్‌టిపిసి ఈ ప్రా జెక్ట్ రెండవ దశను రూ.17739 కోట్ల అంచనాలతో రూపొందించగా , 2022–23 సంవత్సరం ధరలతోతిరిగి ముదింపు చేయాల్సి ఉన్నదని, కానీ పిపిఎకు గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు.2023 అక్టోబర్ నుండి జనవరి 29 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి మూడు లేఖలు రాసినట్టు సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసిందన్నారు. కీలకమైన పిపిఎను త్వరితగతిన చేసి, ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఆమోదిస్తామని ఎన్‌టిపిసి తెలిపిందని రవికుమార్ పేర్కొన్నారు.

## బిజెపి మూడో జాబితా విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల కోసం తొ మ్మిది మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను బిజెపి అధిష్ఠానం గురువారం విడుదల చేసింది. ఈ జాబితాలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బిజెపి తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై తదితరుల పేర్లు ఉన్నాయి. మూ డో జాబితాలో ప్రధానంగా తమిళనాడు నేతల పేర్లను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం కోయంబత్తూర్ నుంచి అన్నామ లై, చెన్నై సౌత్ నుంచి తమిళిసై సౌందరరాజన్, నీలగిరి నుంచి ఎల్ మురుగన్ పోటీ చేయనున్నారు. చెన్నై సెంట్రల్ నుంచి వి నోజ్ సెల్వం, వేలూరు నుంచి ఏసి షణ్ముగం, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్, పెరంబలూరు నుంచి టిఆర్ పరివేందర్, తూత్తుకుడి నుంచి నైనార్ నాగేంద్రన్, కన్యాకుమారి నుంచి పొన్ రాధాకృష్ణన్ పోటీ చేయనున్నారు.

## ఆర్‌టిసి పోర్టర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి అజీజ్‌పాషా డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ ఆర్‌టిసికి ప్రజలకు అనుసంధానంగా ఉంటూ ఆర్‌టిసి బస్టాండ్లలో పనిచేస్తున్న లైసెన్స్ పోర్టర్స్‌ను గుర్తించి నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్‌పాషా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఎస్‌ఆర్‌టిసి లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జనరల్ బాడీ సమావేశం గురువారం ఎంజిబిఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఎంజిబిఎస్‌తో పాటు ఇతర ఆర్‌టిసి బస్టాండ్లలో ప్రయాణికుల సామగ్రిని బ స్సులలో చేర్చుతూ నిత్యం ఆర్‌టిసికి, ప్రజలకు సేవ చేస్తున్న హమాలీలు పిఎఫ్, ఇఎస్‌ఐ లాంటి సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వీరికి ఆర్‌టిసి ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతిని ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ మొండి వైఖరి వల్ల కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరగాల్సిన జీతా లు పెంచకుండా తగ్గించటం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే రంగంలో ఉన్నటువంటి పోర్టర్లకు ఇస్తున్న సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి పోర్టర్స్ కూడా క ల్పించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్లలో పనిచేస్తున్న పోర్టర్స్‌కు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన పెంపు జరిగే విధం గా చూడాలని, వారికి రెస్ట్ రూములు, యూనిఫామ్ ఇతర సౌకర్యాలు ఆర్‌టిసి యాజమాన్యం అందివ్వాలని డిమాండ్ చేశారు. అనేక ఏళ్లుగా పనిచేస్తున్న పోర్టర్స్ ఎలాంటి రక్షణ లే కుండా ఉంటున్నారన్నారు. ఆర్‌టిసి పోర్టర్స్ సమస్యల కోసం ఎఐటియుసి రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి యాజమాన్యంతో పోరాడి హక్కులను సాధిస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిక మతం యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొడ్డుపల్లి కిషన్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ జి.దాసు, ప్రధాన కార్యదర్శి ఎండి.కాసిం, జాయింట్ సెక్రెటరీ కె.కొండయ్య, కోశాధికారి డి.శ్రీను, ఎఐటియుసి నగర నాయకులు చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ యజ్ఞ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయండి

తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** అన్యాక్రాంతమవుతున్న భూదాన భూములను రక్షించడంతో పాటు ఇప్పటివరకు ఉన్న భూదాన భూములను పేదలకు పంపిణీ చేసేందుకు భూదాన్ యజ్ఞ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్.శంకర్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా మహాసభలు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గల తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో గురువారం జరిగాయి. ఈ మహాసభలకు మండలి సీనియర్ నాయకులు భాస్కర్ అధ్యక్షతన వహించారు. మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.శంకర్‌నాయక్ ప్రసంగిస్తూ గత ప్రభుత్వాలు, ముఖ్యంగా బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల విలువైన భూదాన్ భూములు బడా భూకబ్జాదారులు, మైహోం రామేశ్వరరావు, పళ్ళ రాజేశ్వర్‌రెడ్డి వంటి భూబకాసురుల కోరల్లో చిక్కుకున్నాయని, భూదాన్ భూములను ప్రైవేట్ భూములుగా చూపించి ధరణి పోర్టల్ లో కూడా ఎక్కించారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, గండిపేట్, మియాపూర్, మహేశ్వరం, కందుకూరు, రాజేంద్రనగర్, ఉప్పల్, ఘట్‌కేసర్ మండలాల్లో కోట్లాది రూపాయల విలువైన వేల ఎకరాల భూదాన భూములు ఉన్నాయని, భూదాన భూములు కబ్జాలు కావడంతోపాటు గత భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి చట్టబద్ధత లేని పాత ప్రోసీడింగ్ తేదీలతో వందలాది ఎకరాలు కనుమరుగు చేసాడని ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేసి, భూదాన భూముల కబ్జాలకు తెరలేపిందని పేర్కొన్నారు. 1951లో ఆచార్య వినోబా భావే మొదటిసారి నల్గొండ జిల్లా, పోచంపల్లి గ్రామంలో వెదిరె రామచంద్రారెడ్డి నుంచి భూదానంగా భూమిని తీసుకుని పేదలకు పంపిణీ చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి కబ్జాలకు గురైన భూదాన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, జిల్లాలోని భూమి, ఇళ్ళు లేని పేద ప్రజలకు పంపిణి చేయాలని అయన కోరారు. ఇష్టారాజ్యంగా చట్టబద్ధత లేని పాత ప్రోసీడింగ్‌లతో అవకతవకలకు పాల్పడ్డ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని శంకర్‌నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

**నూతన కమిటీ ఎన్నిక :** తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా రమేష్, గోవిందమ్మ, కార్యదర్శిగా యాదమ్మ, సహాయ కార్యదర్శులుగా విజయ, పరశురాముడు, ప్రత్యేక ప్రతినిధిగా భాస్కర్, కోశాధికారిగా పి. సూర్యంలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మహాసభలో తెలంగాణ సర్వోదయ మండల్ రాష్ట్ర నాయకులు వై.గిరిప్రసాద్, మండలి సభ్యులు, జిల్లా నాయకులు యాదమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికులకు అందుబాటులోకి క్యూఆర్ కోడ్‌లు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ టిక్కె ట్ బుకింగ్ కౌంటర్లలో క్యూ ఆర్ కోడ్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్‌ల కొనుగోలును మరింత సులభతరం చేసింది. ప్రయోగాత్మకంగా దక్షిణ మధ్య రైల్వే లోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న 14 స్టేషన్‌లలోని 31 కౌంటర్‌లలో ఈ సౌకర్యాన్ని అధికారులు ప్రవేశపెట్టారు. వ్యాపా ర సౌలభ్యాన్ని మెరుగుపరచుకోవడం, నగ దు రహిత లావాదేవీల సౌలభ్యాన్ని సులభతరం చేయడానికి దక్షిణ మధ్య రైల్వే డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తోందని దక్షిణ మధ్య రైల్వే అధికారు లు చెప్పారు. దీనికి అనుగుణంగా జనరల్ బుకింగ్ కౌంటర్‌లలో కూడా నగదు రహిత లావాదేవీల ను ప్రోత్సహించడానికి, డిజిటల్ చెల్లింపులను పెంపొందించడానికి, టిక్కెట్‌లను కొనుగోలు చేసేందుకు క్యూఆర్ కోడ్ దా రా టిక్కెట్ ఛార్జీని చెల్లించే అదనపు సౌకర్యాన్ని దక్షిణ మధ్య రైల్వే ప్రవేశపెట్టింది. దీని ద్వారా సాధారణ టిక్కెట్‌ను కొనుగోలుచేయడానికి నగదు, సరిపడే చిల్లరను తీసుకొని వెళ్ళే అవసరం లేకుండా టిక్కెట్‌ను తక్షణమే పొందే అవకాశం ప్రయాణికులకు కలుగుతుంది. టికెట్ కొనుగోలు చేసే సమయంలో టికెట్ జారీ చేసే క్లర్క్ నమోదు చేయాల్సిన ముఖ్యమైన వివరాలు, ఛార్జీ తదితర ఇతర వివరాలను సూచించే డిస్‌ప్లే బోర్డులను ముఖ్య స్టేషన్‌లలోని జనరల్ బుకింగ్ కౌంటర్‌లలో టిక్కెట్ విండో వెలుపల ఏర్పాటు చేశారు.

### నగదు చెల్లింపుల నుండి ఉపశమనం : అరుణ్ కుమార్ జైన్

దీనిద్వారా ఈ వివరాలను మరింత ఖచ్చితత్వం కోసం టికెట్ కొనుగోలు చేసే ప్రయాణికులు తనిఖీ చేసుకునే అవకాశం కలుగుతుంది. డిస్‌ప్లే బోర్డులో సాధారణంగా బయలుదేరే స్టేషన్, చేరుకొనే స్టేషన్, ప్రయాణపు తరగతి వివరాలు, పెద్దలు, పిల్లల సంఖ్య తెలిపే వివరంతో పాటు ఛార్జీలు తదితర వివరాలు తెలియచేస్తాయి. దీనికి అదనముగా ప్రయాణికులు చెల్లించాల్సిన చార్జీకి సంబంధించిన క్యూ ఆర్ కోడ్ కూడా డిస్‌ప్లే బోర్డులో కనిపిస్తుంది. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న పేమెంట్ యాప్ ద్వారా దీనిని స్కాన్ చేసే వెసులుబాటు కలుగుతోంది. చెల్లించాల్సిన చార్జీ జమచేసిన తరువాత టికెట్ జనరేట్ జరుగుతుంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రయాణికులు తమ టిక్కెట్‌లను జనరల్ కౌంటర్‌లలో కొనుగోలు చేసేందుకు డిజిటల్ చెల్లింపుల ఎంపికను ప్రవేశపెట్టినందుకు కమర్షియల్, టెక్నికల్ స్టాఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. రైలు వినియోగదారులందరూ సాధారణ టిక్కెట్‌లను కొనుగోలు చేయడానికి ఈ క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విధానం పారదర్శకతకు మైలు రాయిగా నిలుస్తోందన్నారు. నగదు చెల్లింపుల నుండి ఉపశమనం కలిగిస్తుందని అరుణ్ కుమార్ జైన్ అన్నారు.

### ఈ స్టేషన్‌లలో క్యూ ఆర్‌కోడ్ సేవలు..

తొలి దశలో భాగంగా సికింద్రాబాద్ డివిజన్‌లోని 14 ముఖ్యమైన స్టేషన్‌లైన సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, బేగంపేట, వరంగల్, మంచిర్యాల్, లింగంపల్లి, హైటెక్ సిటీ, జేమ్స్ స్ట్రీట్, మహబూబాబాద్, బెల్లంపల్లి, ఫతేనగర్ బ్రిడ్జ్, సిర్పూర్ కాగజ్ నగర్, వికారాబాద్ స్టేషన్‌లలోగల 31 కౌంటర్‌ల ద్వారా రైలు వినియోగదారులకు ఈ నగదు రహిత లావాదేవీల సదుపాయం అమలు చేస్తున్నారు.

**LOST PASSPORT**

I, **VIVEKANAND DUBEY**, D/o **PRAFULLA KUMAR DUBEY**, R/o. H.No. 3-3/36, Villa No. 36, Ville Green, Kismatpur, Bandlaguda Jagir, Gandipet Mdl, Ranga Reddy Dist., T.S. I lost my **Passport No. L2016949**. Loss in Chinthapally (Nalgonda). If anybody found return to the above mentioned address. Contact No. **8978742054**.

**సర్టిఫికెట్స్ పోయినవి**

నేను అనగా **దాసరి వైష్ణవి,** తండ్రి **దాసరి యాదయ్య,** నివాసం: దోనిపాముల గ్రామం, చండూర్ మండలం, నల్లగొండ జిల్లా. తేదీ: 05.01.2024న దోనిపాముల నుండి నల్లగొండకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యలో **10th Class Memo** ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి. దొరికిన వారు **8096953939** నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయగలరు.

ప్రజాపక్షం

శుక్రవారం, మార్చి 22

# పెరుగుతున్న బలవంతపు 'శ్రమ'

ఉపాధి కోసం ఏదో ఒక పనిచేయడం సాధారణం. తమకు నచ్చని రంగాల్లో పనులు చేస్తున్న వారు కూడా ఉన్నారు. కానీ, గత దశాబ్దకాలంలో బలవంతంగా పనుల ఊబిలో చిక్కుకుపోయి అల్లాడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. సగటున ప్రతి వేయి మందికిగాను 3.5 మంది బలవంతపు పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తాజా అధ్యయనం స్పష్టం చేసింది. గత పదేళ్లలో వీరి సంఖ్య 37 శాతం పెరిగినట్టు 'లాభాలు.. పేదరికం, బలవంతపు శ్రామికుల ఆర్థిక పరిస్థితులు' నివేదిక వెల్లడిస్తున్నది. శ్రమ దోపిడీని ఇలాంటి బలవంతపు శ్రమ ఒక ఆనవాయితీగా మారుస్తుందని ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్. హాంగ్‌బో చేసిన ప్రకటనపై యావత్ ప్రపంచం స్పందించి తీరాలి. లేకపోతే నిర్బంధ కార్మికుల జీవితాలు కష్టాలు, కన్నీళ్లతో సహవాసం చేస్తుంటే, వీరి ద్వారా యజమానులు సంవత్సరానికి సగటున 36 బిలియన్ డాలర్ల విలువైన అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారు. శ్రమించడం తప్పుకాదు... కానీ, బలవంతంగా పనులు చేయించుకోవడం ముమ్మాటికీ తప్పే. తద్వారా అధిక లాభాలు పొందుతూ, అమాయకుల జీవితాలను దుర్భరంగా మార్చడం అమానుషం. కార్మిక అక్రమ రవాణా దుర్మార్గం. సౌదీ అరేబియా, కతార్‌లో భారత కార్మికులతోసహా, అనేక ప్రాంతాల్లో ఇలాంటి కార్మికులు కోకొల్లలు. లేబర్‌ను అక్రమంగా తరలిస్తున్న వారు ఒక్కో బాధితుడి నుంచి లాభపడుతున్న సొమ్ము దశాబ్దం క్రితం 8,269 డాలర్లుకాగా, ఇప్పుడు ఇది 10,000 డాలర్లను మించిపోయింది. పేదల ఆర్థికావసరాలను ఆసరాగా చేసుకొని, వారిని బలవంతంగా పనుల్లోకి నెడుతున్న అక్రమార్కుల సంపపాదన ఐరోపా, మధ్య ఆసియాలో 84 బిలియన్ డాలర్లు, ఆసియా, పసిఫిక్‌లో 62, అమెరికాలో 52, ఆఫ్రికాలో 20, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో 18 బిలియన్ డాలర్లుగా ఉంది. శ్రమ దోపిడీ స్థాయికి ఇది నిదర్శనం. బలవంతపు శ్రమతోపాటు, బలవంతపు వాణిజ్య లైంగిక దోపిడీ కూడా నిరాటంకంగా కొనసాగుతున్నది. వివిధ పనుల కోసం వెళ్లిన బాలికలు, మహిళల్లో 73 శాతం మంది సెక్స్ వర్కర్లుగా మారుతున్నారని ఐఎల్ఓ అంచనా. ఈ గణాంకాలు మానవత్వ జాడలను వెతుకుతున్నాయి. ఒకవైపు పేదరికంతో పోరాటం... మరోవైపు శారీరక దోపిడీతో యుద్ధం... ఇంకోవైపు మానసిక ఒత్తిడితో సతమతం.. ఇదీ ఈ బలవంతపు శ్రమ సుడిగుండంలో చిక్కుకున్న అభాగ్యుల పరిస్థితి. చట్టవిరుద్ధమైన లాభాల ప్రవాహాలను అరికట్టడానికి, నేరస్థులను చట్టపరంగా శిక్షించడానికి అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐఎల్ఓ నివేదిక స్పష్టం చేసింది. పదేళ్ల కాలంలో పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, భవిష్యత్తులో మరింత పతనంకావడం ఖాయమని తేల్చి చెప్పింది. కార్మిక, నేర చట్టాలు... వాటి అమలుకు మధ్య సమన్వయ లోపమే సమస్యకు ప్రధాన కారణం. అవినీతి, లంచగొండితనం ఈ బలవంతపు శ్రమ వ్యవస్థను పెంచిపోషిస్తున్నాయి. పేదరికం, నిరక్షరాస్యత వేలాది మందిని బలవంతపు శ్రామికులుగా మార్చేస్తున్నది. ఇష్టం లేకపోయినా, బలవంతంగానో... మోసపూరితంగానో ఎంతోమందిని ఈ అఘాతంలోకి నెట్టే దుర్మార్గులపై ప్రపంచ దేశాలు కొరడా ఝుళిపించాలి. నేరస్థులకు కఠినాతికఠినమైన శిక్షలు విధించాలి. కేవలం చట్టాల అమలు ద్వారా మాత్రమే బలవంతపు శ్రమను అంతం చేయడం సాధ్యం కాదు. ఈ చర్యలు సమగ్ర విధానంలో భాగంగా ఉండాలి. మూల కారణాలను పరిష్కరించే వ్యూహాలు, ప్రణాళికలు రూపొందాలి. బాధితులను రక్షించడం.. దోషులను శిక్షించడం ఎలాంటి లోపాలు, లొసుగులు లేకుండా అమలు కావాలి. న్యాయపరమైన నియామాలను అన్ని దేశాలు అమలు చేస్తే, శ్రామికుల అక్రమ రవాణా తగ్గుతుంది. కార్మికులు కూడా సమష్టిగా తమ హక్కుల కోసం నడుం బిగించాలి. మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

# ఎస్‌ఎల్‌టి వినియోగం ప్రమాదకరం

'పొగతాగడం ప్రమాదకరం' అనే చట్టబద్ధమైన హెచ్చరిక మనందరికీ తెలిసిందే. అయితే, ఇటీవల కాలంలో స్మోక్‌లెస్ టొబాకో (పొగరాని పొగాకు/ ఎస్‌ఎల్‌టి) వినియోగం పెరగడం ఆందోళన సృష్టిస్తున్నది. మహిళలు, ప్రత్యేకించి గర్భిణులు దీనికి అలవాటు పడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ పొగాకు కంటే ఎస్ఎల్‌టి వాడకం మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని హెచ్చరిస్తున్నాయి. ఆ నివేదిక అందించిన వివరాల ప్రకారం, సర్వే చేసిన గర్భిణుల్లో 719 (2.5 శాతం) మంది, పాలిచ్చే స్త్రీలలో 3,426 (3.2 శాతం) మంది ఏదో ఒక రూపంలో పొగాకును ఉపయోగిస్తున్నారు. ఈ సర్వేలో మొత్తం 7,24,115 మంది మహిళలను ప్రశ్నించగా, వారిలో 5,12,575 (70.7 శాతం) మంది వివాహితలు. వీరిలో 28,408 (5.5 శాతం) మంది గర్భిణులు. అందులో 616 మంది పొగ రహిత పొగాకు, 95 మంది పొగబెట్టిన పొగాకు, 8 మంది రెండు రకాల పొగాకును ఉపయోగించారు. సర్వే సమయంలో, వివాహిత జనాభాలో 1,05,482 (20.6 శాతం) మంది పాలిచ్చే తల్లులు. వీరిలో 2,934 (2.8 శాతం) మంది పొగలేని పొగాకును, 447 (0.4 శాతం) మంది పొగబెట్టిన పొగాకును ఉపయోగించారు. 45 (0.04 శాతం) మంది రెండు రకాలైన పొగాకును ఉపయోగించారు. మొత్తం మీద పొగాకు వాడుతున్న వారిలో 85.6 శాతం మంది దానిని పొగ రహిత రూపంలో ఉపయోగిసున్నారు. ఎస్ఎల్‌టి వినియోగం పెరడానికి అది చౌకగా లభించడమే ప్రధాన కారణం. సులభమైన లభ్యత, ఆమోద యోగ్యత వంటి కారణాలు కూడా ఉన్నాయి. మధ్య భారత ప్రాంతాలలో పొగాకును ఉపయోగించే గర్భిణులు ఎస్ఎల్‌టి, మిశ్రమ పొగాకును, దక్షిణాదిలో ఎస్ఎల్‌టిని ఎక్కువగా వినియోగించే అవకాశం ఉన్నారు. అత్యంత ధనవంతుల నుండి



పేదల వరకూ అందరూ ఎస్ఎల్‌టి వినియోగం పట్ల ఆకర్షితులవుతున్నారు. ఈ ప్రాంతీయ వైవిధ్యాలు సాంస్కృతిక ప్రభావాలు, పొగాకు వినియోగాన్ని విస్తృతంగా ఆమోదించడం, దేశవ్యాప్తంగా పొగాకు నియంత్రణ విధానాల అమలులో తేడాలు కూడా ఎస్ఎల్‌టి వాడకాన్ని పెంచుతున్నదని అంటున్నారు. గ్రామీణ, పట్టణ పరిస్థితులను పోల్చి చూస్తే, పొగాకు వినియోగిస్తున్న పాలిచ్చే మహిళల్లో పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో పొగలేని పొగాకు వినియోగం 19.4 శాతం తక్కువ. ఆల్కహాల్ తాగని స్త్రీల కంటే పాలిచ్చే, గర్భిణులు పొగాకు వాడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనం కనుగొంది. దుర్బలమైన మానసిక స్థితే ఇలాంటి అలవాట్లకు కారణమవుతుంది. కాబట్టి, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇలాంటి దుర్వ్యసనాల జోలికి వెళ్లకుండా, వారిని అన్ని విధాలా చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఈ బలహీనతవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. గర్భస్థ శిశువులు, చిన్నారులకు జరగబోయే ప్రమాదాలను వివరిస్తే మెరుగైన ఫలితాలు ఉండవచ్చు.

# ఉన్నోళ్ల మారాజు మన మోడీజీ!

## కుబేరుల ఆదాయవాటాలో అమెరికా, యుకెల తలదన్నిన భారత్

(ప్రత్యేక కథనం)

చేతిలో కరెన్సీ కాగితాలు కళకళలాడుతుంటాయి – కాని సామాన్యుల బతుకులు రోజురోజుకూ దిగజారుడే. తమ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ గట్టుదాటించామని ప్రధాని నరేంద్ర మోడీ ఆయన అనుచర ప్రచారదళం గళగర్జన చేస్తున్నది, అనుకూల మీడియా బాకాలూదుతున్నది. దేశంలో దుర్భర దారిద్ర్యాన్ని 5 శాతం జనాభా దిగువకు తెచ్చిన ఘనమైన పాలన మోడీజీదేనని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గృహ వినియోగ వ్యయం సర్వే నివేదిక తెలియజేసింది. అటువంటప్పుడు కరోనా సమయంలో పేదలను ఆదుకునేందుకు కొంత ఆలస్యంగానైనా ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన' కింద నెలకు తలకు 5 కిలోలు ఆహారధాన్యాలు ఉచితంగా పంపిణీచేసే కార్యక్రమాన్ని ముందుగా ఒక సంవత్సరం, తర్వాత ఏకంగా 5 సంవత్సరాలకు పొడిగించటంలోని ఔచిత్యమేమిటో ఆలోచించాలి. దీనికింద 80 కోట్ల మంది పేదలకు ఊరట కలుగుతోందని ప్రభుత్వం చెబుతోంది. అంటే దారిద్ర్యం నిర్మూలన ప్రచారం అబద్ధమనే కదా! మోడీ పాలనలో అభివృద్ధి విశాల ప్రాతిపదికపై ఉన్నందున అసమానతలు తగ్గాయని, అసమానతలు లేని భారత్ ఇంకెంతోదూరంలో లేదన్నట్లుగా నీతి ఆయోగ్ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానం. ఇదంతా ఎన్నికల ముందు అసంఖ్యాక ప్రజానీకాన్ని మత్తుకుతోడు మబ్బులో ఉంచే ప్రచారమని రుజువవుతున్నది. జాతీయాదాయం పంపిణీలో 1951 నాటి పరిస్థితే మెరుగ్గావుందని, 1991లో సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టిన తదుపరి ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయని 'భారతదేశంలో ఆదాయం, సంపదలో అసమానత' శీర్షికతో 'ప్రపంచ అసమానత పరిశోధనాశాల' ప్రచురించిన నివేదిక తేటతెల్లం చేస్తున్నది. ఇది ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి బరితెగించిన దోపిడీ పర్యవసానం. అమెరికా జనాభాలో 1 శాతంగా ఉన్న మహాకుబేరులు దేశ సంపదలో సింహభాగాన్ని దోచుకుంటున్న వైనాన్ని ప్రపంచం దృష్టికి తెస్తూ దశాబ్దం క్రితం నిరుద్యోగ యువతీయువకులు 'మేము 99శాతం' నినాదంతో వాల్‌స్ట్రీట్‌లో నెలల తరబడి సాగించిన నిరసన గుర్తుచేసుకోదగింది. మనదేశంలోనూ అధిక ధరలతోపాటు నిరుద్యోగం తాండవిస్తున్నది. సామాన్య, మధ్యతరగతి జనాభా జీవితాలు ఆగమాగమవుతున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్టవేయగలిగిందీ, కొంతైనా మార్పు తేగలిగింది ప్రజాపోరాటాలే. కాని పోరాటాల్లో ముందు



భారతదేశ ఆదాయంలో (2022) మన జనాభాలో అత్యున్నతస్థాయిలోని 1 శాతం (9 లక్షల 20 వేల మంది) వాటా బ్రిటిష్ పాలనానాటికన్నా ఇప్పుడే ఎక్కువ అనే విశ్లేషణ సదాలోచనపరులెవరికైనా ఒళ్లు గగుర్పాటు కలిగించకమానదు. ఈ రకంగా ఆదాయం కొద్దిమంది వద్ద పోగుపడటం ఆర్థిక సంస్కరణల ప్రవేశంపై ప్రారంభమైంది. గత 20 ఏళ్లలో, మరీ ముఖ్యంగా గడచిన పదేళ్లలో అది పెచ్చరిల్లింది. 80వ దశకంలో కూడా ఆదాయవాటాలో ఇంత అగాధంలేదు.

నిలబడాల్సిన యువత పాలకవర్గం దుష్ప్రచారంలో, అది సృష్టిస్తున్న భ్రమల ప్రపంచంలో, కుల, మత, వ్యక్తి ఆరాధన మత్తులో పక్కదోవపడుతున్నది. సమాజంలో అసమానతలు, అరాచకాలు పెరుగుతున్నాయి. సంపద సృష్టికర్తలైన శ్రమజీవులు అర్థాకలితో వ్యథాభరిత జీవితాలు గడుపుతుంటే, ప్రభుత్వ అండదండలతో రెక్కలు విచ్చుకున్న పెట్టుబడిదారీవర్గాల దోపిడీ విశృంఖలమై వికటాట్టహాసం చేస్తోంది. ఈ పరిస్థితులను కళ్లకు కడుతున్నది ఈ 'అసమానతల' నివేదిక.

భారతదేశ ఆదాయంలో (2022) మన జనాభాలో అత్యున్నతస్థాయిలోని 1 శాతం (9 లక్షల 20 వేల మంది) వాటా బ్రిటిష్ పాలనానాటికన్నా ఇప్పుడే ఎక్కువ అనే విశ్లేషణ సదాలోచనపరులెవరికైనా ఒళ్లు గగుర్పాటు కలిగించకమానదు. ఈ రకంగా ఆదాయం కొద్దిమంది వద్ద పోగుపడటం ఆర్థిక సంస్కరణల ప్రవేశంతో ప్రారంభమైంది. గత 20 ఏళ్లలో, మరీ ముఖ్యంగా గడచిన పదేళ్లలో అది పెచ్చరిల్లింది. 80వ దశకంలో కూడా ఆదాయవాటాలో ఇంత అగాధంలేదు.

ప్యారిస్ కేంద్రంగా పనిచేస్తున్న 'ప్రపంచ అసమానత ల్యాబ్' నివేదికకు సహరచయితలు నితిన్‌కుమార్ భారతి, లుకాస్ చాన్సెల్, థామస్ పికెట్టి, అనుమోల్ సోమాంచి. ప్రజాపనులపై ప్రభుత్వ పెట్టుబడి సమీకరణ నిమిత్తం అతిసంపన్న తరగతులపై 2 శాతం సూపర్ టాక్స్ విధించాలని వారు సూచించారు. సంపద కేంద్రీకరణ కారణంగా, 2014–15 మరియు 2022–23 మధ్య అసమానత శిఖరాగ్రానికి చేరిందని పేర్కొన్నారు. ఆదాయం, సంపద రెండింటినీ లెక్కలోకి తీసుకునేలా భారతదేశ పన్నుల విధానాన్ని పునర్నిర్మాణం చేయాలని సూచించారు. ప్రపంచీకరణ తరంగం నుండి సామాన్యులకు లబ్దిచేకూర్చేందుకుగాను ఆరోగ్యం, విద్యపై పెట్టుబడుల పెంచే నిమిత్తం వనరులు వృద్ధి చేసుకోవాలని వక్కాణించారు.

ఆ నివేదిక ప్రకారం, 2022లో, జాతీయాదాయంలో 22.6 శాతం ఉన్నతస్థాయిలోని 1శాతం భారతీయులకు దక్కింది. వెనక్కివెళ్లి 1951 నాటి స్థితిని పర్యాలోకిస్తే ఆనాడు వారి వాటా 11.5 శాతమే. సంస్కరణల పేరుతో గేట్లు తెరవకముందు – 1980 దశకంలో సైతం ఆ వాటా 6 శాతమే. రెండోవైపున భారతీయుల్లో దిగువ 50శాతం 2022లో జాతీయాదాయంలో 15శాతం మాత్రమే ఆర్జించారు. 1951లో ఆవాటా 20.6 శాతం. మధ్యస్థాయి 40 శాతం భారతీయుల వాటా అదేకాలంలో 42.8 శాతం నుండి 27.3 శాతానికి పడిపోయింది.

2022లో 1 శాతం మహాసంపన్న భారతీయులకు దేశ సంపదలో లభించిన వాటా చారిత్రాత్మక శిఖరాన్ని చేరుకుంది. అమెరికా, యునైటెడ్ కింగ్‌డం వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని కుబేరులు సైతం ఈ స్థాయి ఎదుగుదలను చూడలేదు. 2022–23లో భారతీయ మహాకుబేరులైన దాదాపు 10వేలమంది – ఆదాయ నిచ్చెనలో 0.001 శాతం జాతీయ ఆదాయంలో 2.1 శాతం ఆర్జించారు. అగ్రస్థాయిలోని 0.01 శాతం మంది 4.3 శాతం, 0.1శాతం మంది 9.6 శాతం సొంతం చేసుకున్నారు. ఇదీ మోడీ ఎకనామిక్స్– ఆశ్రితులకు బంగారు పళ్లెల్లో విందు భోజనం, అత్యధిక మెజారిటీగా ఉన్న జనాభాకు విస్తరాకుల్లో పచ్చడి మెతుకులు. సాంస్కృతిక జాతీయవాదం, వారసత్వ సంపద పునరుద్ధరణ, పునరుజ్జీవనం కబుర్లతో తాదాత్మ్యం చెందితే పాలకవర్గాల అధికార ఆకాంక్షలు నెరవేరవచ్చునేమోగాని ప్రజల భౌతిక పరిస్థితులు మెరుగుకావు, దేశ అభివృద్ధి వక్రమార్గంలో ప్రయాణిస్తుంది. తస్మాత్ జాగ్రత్త!

# విద్వేషాలు రెచ్చగొట్టే 'రజాకార్'

అబద్ధాన్ని నిజమని నమ్మించడం ఎలా చేయాలో ప్రస్తుతం విడుదలైన రజాకార్ సినిమా చూసి నేర్చుకోవచ్చు. రాజ్యాంగ యంత్రాంగం అండ, మీడియా ప్రసార సాధనాలు ఉపయోగించి, కల్పిత గాథలతో డబ్బు పెట్టుబడిగా పెట్టి ఇది నిజమని ప్రజలను నమ్మించవచ్చు. చరిత్రను హైజాక్ చేయవచ్చు. లేనివి ఉన్నట్లుగా, ఉన్నవి లేనట్లుగా చూపించవచ్చు. రజాకార్ పేరుతో బిజెపికి చెందిన వ్యక్తి నారాయణరెడ్డి సినిమా తీస్తున్నట్లుగా ప్రచారం జరగగానే దానిపై అనేక అనుమానాలు వచ్చాయి. ఆ అనుమానాలు ఇప్పుడు నిజమయ్యాయి. మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించారు. ఆ పోరాటం హిందువుల ముస్లింల మధ్య జరిగినట్లుగా, ముస్లింలను హిందువులకు శత్రువులుగా కథలు అల్లారు. వాటినే వాస్తవంగా చెప్పుకొచ్చారు.

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలకుడిగా ఉన్న సమయంలో తెలంగాణ సంస్థానంలో ప్రజలు స్వేచ్ఛ వాయువుల కోసం ఎర్ర జెండా నాయకత్వంలో సుదీర్ఘకాలం పోరాటాలు చేశారు. అనేక త్యాగాలు చేశారు. నాలుగు వేలకు పైగా ప్రజలు ప్రాణాలర్పించారు. పది లక్షల ఎకరాల భూమి పంచబడింది. నిజాం రాజు మీర్ ఉస్మాన్ భారత ప్రభుత్వంతో ముందస్తు చేసుకున్న ఒప్పంద ప్రకారం లొంగిపోయాడు. కమ్యూనిస్టులను అధికారంలోకి రాకుండా అడ్డుకున్నారు. అయితే, తెలంగాణలో నిజాం ప్రైవేట్ సైన్యం స్థానిక భూస్వాముల అండతో రజాకార్లు చేసిన అకృత్యాలు ప్రజల జీవితాలను విచ్ఛిన్నం చేశాయి. నిజాం ఏలుబడిలో అనేకమంది భూస్వాములు, దొరలు, జాగిర్దారులు, మక్తేదారులు, దేశ్‌ముఖ్‌లు, పట్వారీ, పటేల్లు ప్రజలను వెట్టి కట్టుబానిసలుగా మార్చేశారు. అన్ని రకాలుగా పీడించారు. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేదు, ఏలాంటి హక్కులు లేవు. ఈ తరుణంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కమ్యూనిస్టులు ప్రజల మద్దతుతో పోరాటాలు నడిపారు. కేవలం ఒక కులమో, ఒక మతమో చేసిన పోరాటం కాదిది. సకలజనులు, పీడిత ప్రజానీకం ఏకమై దొరనీ బాంచన్ అన్న బడుగు జీవులే బందూకు బట్టి నిజాం ప్రభుత్వ మెడలు వంచారు. నాలుగు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసి ఒక నూతన ప్రపంచాన్ని ప్రజలకు పరిచయం చేశారు కమ్యూనిస్టులు.

కొన్ని ఘటనలను ఆధారంగా చేసుకుని నిర్మించిన రజాకార్ సినిమా అంతా మత దృష్టి కోణంతో నిర్మించబడింది. వాస్తవాలను మరుగున పడేసి ప్రజల దృష్టిని మళ్లించారు. కేవలం ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. అందులో భాగంగానే రజాకార్ సినిమాను తీశారు. ఈ సినిమాలో ఆ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన కమ్యూనిస్టులను వారి త్యాగాలను తెరమరుగు చేశారు. ఆనాటి పోరాటంలో వేలాది మంది ముస్లింలు ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములయ్యారు. షోయబుల్లాఖాన్, మగ్దూం మోహినుద్దీన్, షేక్ బందగీకి లాంటి వీరయోధులు అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. రజాకార్ల ఉపసేనాధిపతి విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, జెన్నా



రెడ్డి ప్రతాప్ రెడ్డి లాంటి అనేక మంది భూస్వాములు, వారందరు కూడా రజాకార్లు, నిజాం పోలీసులు, మిలిటరీ సైన్యంతో కలిసి ప్రజల ఆస్తులు, మాన ప్రాణాలు దోచినవారే. కమ్యూనిస్టులను, ఉధృతంగా నడుస్తున్న ప్రజా ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేశారు. ఇలాంటివి ఈ సినిమాలో చూపించలేదు. కేవలం హిందూ ముస్లిముల మధ్య జరిగిన ఘర్షణలుగా చూపించారు.

సెప్టెంబర్ 1948 కంటే ముందు యూనియన్ సైన్యాలు తెలంగాణ సంస్థానంలోకి ప్రవేశించకముందు పదిహేను వందల మంది ప్రజలు ప్రజా పోరాటంలో ప్రాణాలొదిలారు. అయితే మిలిటరీ సైన్యాలు నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ ను లొంగదీసుకున్నాక సంస్థానాన్ని వదిలి పోలేదు. 1952 ఎన్నికల నాటికి తెలంగాణలో మిలిటరీ సైన్యం ఉంది. ఇక్కడి భూస్వాములకు, దొరలకు అండగా నిలబడింది. సుమారుగా మూడు వేల మందిని ఉద్యమకారుల్ని, ప్రజలను బలితీసుకున్నారు. ఈ వాస్తవాలను రజాకార్ మూవీలో ఎక్కడ ప్రస్తావించలేదు, చూపించలేదు. చూపించిన కొన్ని ఘటనలు కూడా కలగాపులగం చేశారు.

ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తూ నిజాం ప్రభువును రాష్ట్ర ప్రముఖ్‌గా నియమించింది. నిజాం ఆస్తులకు రక్షణ కల్పించింది. లక్షలాది రూపాయలు చెల్లించింది. ఆనాటి కరుడుగట్టిన రజాకార్ సైన్యాధ్యక్షుడు ఖాసిం రజ్వీని క్షేమంగా దేశం దాటించారు. కమ్యూనిస్టులు పంచిన లక్షలాది ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకొని భూస్వాములకు అప్పగించారు. ఇలాంటి చరిత్రను చెప్పకుండా రజాకార్ సినిమా ద్వారా అబద్ధపు ప్రచారాల్ని ముందుకు తీసుకువచ్చింది. హిందువులకు ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా మొదటి నుంచి మతతత్వ బిజెపి పార్టీ వక్రీకరించి చెబుతూ వస్తుంది. ఆనాటి పోరాటంలో ఎలాంటి ప్రమేయం లేని హిందూ మహాసభ, ఆర్.ఎస్.ఎస్, ఆర్య సమాజ్ లాంటి సంస్థలు ఆనాడు రాజ్యానికి, భూస్వామ్య వ్యవస్థకు మద్దతుగా ఉన్నాయి. ఇప్పుడు మనువాద భూర్జువా పార్టీలు కూడా తామే వారసులమని కట్టు కథలు చెబుతున్నాయి.

తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత సాయుధ పోరాటానికి మతం రంగు పులిమారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడం కోసం బిజెపి నాయకుడు గూడూరు నారాయణరెడ్డి రూపొందించిన సినిమా ఇది. మత కొట్లాటలతో లబ్ధి పొందాలని చూసే పాలకులకి మనువాద ఫాసిస్టు రజాకర్ మూవీ ఒక ఆయుధం. అందుకే పన్ను మినహాయించాలని బిజెపి పెద్దలు కోరుతున్నారు. ప్రజల మధ్య చీలిక తీసుకువచ్చి, విద్వేషాలనూ రెచ్చగొట్టి తెలంగాణలో బలపడాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ముస్లింలను శత్రువులుగా చూపించి మతఘర్షణలు సృష్టించే అవకాశం ఉన్న సినిమా రజాకార్. దీనిని వెంటనే నిషేధించాల్సిన అవసరం ఉంది. ఫాసిస్టుల ప్రయత్నాలని కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర లౌకిక శక్తులు, చైతన్యవంతమైన మేధావి వర్గం, తెలంగాణ సకల జనం తిప్పి కొట్టాలి. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మతోన్మాద శక్తులు ఎంత ప్రయత్నించినా వాస్తవ చరిత్రను దాచిపెట్టలేరు. వాస్తవ చరిత్రను, పోరాట వారసత్వాన్ని ఇక్కడి ప్రజలు సొంతం చేసుకొని ఉన్నారు. దాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తూనే ఉంటారు. ఎర్ర జెండా వారసత్వాన్ని ప్రశ్నించే తత్వాన్ని తెలంగాణ సమాజం తప్పక నిలబెట్టుకుంటుంది.

– మామిండ్ల రమేష్ రాజా
7893230218

# టెట్ లేకుండా పదోన్నతులు ఇవ్వాలి

లేఖ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ లేకుండా పదోన్నతులు ఇవ్వాలి. టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ ) అనగా ఉపాధ్యాయుల అర్హత పరీక్ష.ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక తొమ్మిది సంవత్సరాలు కావొస్తున్న పదోన్నతుల విషయంలో ఎన్సీటిఈ నిబంధనల పేరిట ఇంకా కాలయాపన చేయడం తగదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి 25,26 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొని ఎన్నో పదవ తరగతి వార్షిక పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీలు, స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలు చేసిన వారికి టీచర్స్ అర్హత పరీక్ష ఉత్తీర్ణత కావాలనడం అర్థరహితమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్షను గణితం, భౌతిక శాస్త్రం,గణితం లో మాత్రమే నిర్వహిస్తున్నారని బయోలజీ, భాషలు (తెలుగు హిందీ ఉర్దూ మరాఠీ మొదలైన దేశీయ భాషలు)లలో టెట్ లేకపోవడం వల్ల తాము చిన్నప్పుడు చదివిన చదువులు గాని లేదా ప్రతిరోజూ చెప్పే పాఠాలు కానీ లేకుండా బయోలజీ వారికి భౌతిక శాస్త్రం లో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రంలో టెట్ పరీక్ష రాయాలనడం విచిత్రమైన విషయంగా వారు అభివర్ణిస్తున్నారు. డిగ్రీలు చేసి డి.ఎడ్ (డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ) బి.హెడ్ ( బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్) తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ మొదలైన దేశీయ భాషలలో పండిత శిక్షణను పూర్తి చేసుకున్న తర్వాత ఆంధ్రప్రదేశ్ సివిల్స్ అని పిలువబడే డి.ఎస్సీ రాసి మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయులుగా ఉద్యోగం లో నియమింపబడుతున్నారు.కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో ఉపన్యాసకులుగా నియమిస్తున్నారు.ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో గత 25,26 సంవత్సరాల నుండి ఎలాంటి పదోన్నతులు లేకుండా ఒకే క్యాడర్‌లో ఉండి పదవీ విరమణకు ఆరు నెలలు, సంవత్సరం, రెండు సంవత్సరాలు మాత్రమే ఉంది. 55, 58 సంవత్సరాలు దాటిన వారు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఈ వయస్సులో టెట్ ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతులు ఇస్తామని మెలికలు పెట్టడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

50 సంవత్సరాల పైబడిన వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని వాటి ప్రకారం 50 సంవత్సరాలు పై బడిన ఉపాధ్యాయులకు టెట్ లేకుండా పదోన్నతులు ఇవ్వాలి.టెట్ తప్పని సరి అన్నప్పుడు వారి సబ్జెక్టులో డిపార్ట్మెంట్ పరీక్షల మాదిరిగా నిర్వహించి పదోన్నతులు కల్పించాలి.ముందు పదోన్నతులు ఇచ్చిన తర్వాత టెట్ ఉత్తీర్ణత సాధించడానికి రెండు, మూడు సంవత్సరాల గడువు ఇవ్వాలి.టెట్ పరీక్షలను ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి అందరూ టెట్ ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉండేటట్లు చూడాలి.

టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ ( టెట్ ) లేకుండా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే డి.ఎస్సీ పరీక్షలు నిర్వహించాలని అనేక మంది నిరుద్యోగ ఛాత్రోపాధ్యాయులు కోరుతున్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు మెగా డి.ఎస్సీ ని ప్రకటించడం వలన అనేక మంది ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ ఛాత్రోపాధ్యాయులు ఉద్యోగం సాధించాలని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. డిగ్రీ లు, పి.జి లు చేసి బి.ఎడ్, ఎం.ఇడి చేసి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూసి ఎదురు చూసి కన్నులు కాయలు కాసాయని అంటున్నారు.టెట్ నిర్వహించకుండా,డి.ఎస్సీ నిర్వహించకుండా ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యా వాలంటీర్ల ద్వారా గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను అతలాకుతలం చేసిందని అంటున్నారు.ఈ ఒక్క సారి టెట్ లేకుండా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న వాళ్ళందరిని మెగా డి.ఎస్సీలో అవకాశం కల్పించి మానవత్వ దృక్పథాన్ని చాటుకోవాలని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు కోరుతున్నారు.

కోర్టు లకు వెళ్లి ప్రభుత్వ నిర్ణయాలను ఆటంకాలు కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రాష్ట్రంలోని అనేక మంది ఉపాధ్యాయులు చీటికి మాటికి తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు కు వెళ్లి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతూ స్టే తీసుకొని వచ్చి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించే భర్తీ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారు.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొన్ని వేలమందికి ఇబ్బందులను గురి చేస్తున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరిని దృష్టిలో పెట్టుకొని పాలసీ లను రూపొందిస్తాయి.దీని ద్వారా అనేక మందికి లాభం లబ్ది చేకూరుతుంది.కొంతమందికి లాభం ఉండదు నష్టం ఉండదు.అలాంటి వారు మాకు రాని పదోన్నతులు ఎవ్వరికీ రావొద్దని ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతూ హైకోర్టు కు లేదా సుప్రీంకోర్టు కు వెళ్లి స్టే తీసుకొని వచ్చి ప్రభుత్వానికి అడ్డంకులు ఆటంకం కలిగిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యాశాఖ అయిన దానికి కాని దానికి హైకోర్టు, సుప్రీంకోర్టు కు వెళ్లి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతు స్టే తీసుకొని వచ్చే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, తెలంగాణ విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం, తెలంగాణ విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన మిగతా తెలంగాణ విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయ పదోన్నతులు, ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియలో ఈ సారి టెట్ లేకుండా చూడాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉపాధ్యాయులు, నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు కోరుతున్నారు.

– డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
9290826988

# తల్లిపాల పరీక్షతో బ్రెస్ట్ కేన్సర్ నిర్ధారణ



తల్లి పాలపై విశ్లేషణల ద్వారా రొమ్ము కేన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చని స్పెయిన్ పరిశోధకులు అంటున్నారు. వారి పరిశోధనల ప్రకారం, రొమ్ముకేన్సర్‌కు కారకమయ్యే ట్యూమర్ డిఎన్ఏ రొమ్ము కేన్సర్ ఉన్న తల్లుల పాలల్లోనూ ఉంటాయి. సాధారణంగా రొమ్ము కేన్సర్ రోగుల్లో ట్యూమర్ డిఎన్ఏ ఉంటుంది. యూనివర్సిటీకి చెందిన దవాఖానలో రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్న ఓ గర్భిణి చేరారు. తన పాల ద్వారా బిడ్డకు కూడా కేన్సర్ సోకుతుందేమోనని ఆమె భయపడ్డారు. ఏడాది క్రితం శీతలీకరణం చేసిన పాలను ఆమె పరిశోధకులకు అందించగా.. ఆ పాలపై పరిశోధనలు చేసి అందులో ట్యూమర్ డిఎన్ఏ ఉన్నట్టు గుర్తించారు. అనంతరం 15 మంది తల్లుల నుంచి పాల శాంపిళ్లను సేకరించి.. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్), డ్రాప్లెట్ డిజిటల్ పీసీఆర్ టెక్నాలజీతో పరీక్షించగా అందులో 13 మంది తల్లుల పాలల్లో ట్యూమర్ డీఎన్ఏ ఉన్నట్టు నిర్ధారించారు. పరిశోధకులు హెచ్ఐవోపై డబ్ల్యూబీసీ జెన్ ప్యానెల్‌ను రూపొందించారు. అయితే ఈ పాల వల్ల పిల్లలకు ఎటువంటి ప్రమాదం ఉండదని అంటున్నారు. ఏదిఏమైనా తల్లిపాలను పరీక్షించి కేన్సర్ నిర్ధారించడం మహిళలకు ఎంతో మేలు చేస్తుంది. సత్వర చికిత్సకు అవకాశం లభిస్తుంది.

## 72.88 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు గురువారం 72.88 లీటర్ల అక్రమ లిక్కర్‌ను, రూ.38,150 విలువైన ఇతర వస్తువులు జప్తు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. పోలీస్, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు క్షేత్ర స్థాయిలో 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం రూ.47,18,300 నగదు, రూ.17,87,290 విలువైన ఇతర వస్తువులను స్వదీనం చేసుకున్నామన్నారు. 177.29 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకోగా 19 మందిపై ప్రోహిబిషన్ కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నగదు, ఇతర వస్తువులపై 6 ఫిర్యాదులు రాగా పరిశీలించి పరిష్కరించారని, ఇప్పటి వరకు 25 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన చల్లా



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డిని అర్బన్ ఫినాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తన పైన నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానని చల్లా నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్ రెడ్డి, కార్పొరేటర్ సిద్ధాల మౌనిక,చల్లా శ్రీనివాసరెడ్డి,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కర్మంఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ వెంకటేష్ గౌడ్,విజయ రెడ్డి పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంతోనే పల్లెసీమలు అభివృద్ధి

### షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కేశంపేట:** ఇందిరమ్మ రాజ్యంతోనే పల్లెసీమలు అభివృద్ధి సాధిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ రాజ్యం తెవాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, భీబిడి అశోక్‌రెడ్డితోపాటు 500మంది శ్రీరంగాపూర్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి హస్తం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. కేశంపేట మండలం నిర్ధవెల్లి గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు దిద్దెల కిష్టమ్మ ఆమె కుమారుడు జంగయ్య బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వారికి హస్తం కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ మౌలిక సౌకర్యాలు కల్పించాలంటే ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమవుతుందని వివరించారు.

**ఘనంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ వివాహ వార్షికోత్సవం**

షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం రంగారెడ్డి జిల్లా నిత్య దూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్,అనూరాద దంపతులను ఆశీర్వదించారు. అదే విధంగా చెంది తిరుపతిరెడ్డి దంపతులు ఎంఎల్‌ఎ దంపతులను సత్కరించారు. మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీంతో పాటు బాబర్‌ఖాన్‌ను ఎంఎల్‌ఎ దంపతులను సన్మానించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివాహా వార్షికోత్సవం సందర్భంగా గురువారం కేశంపేట జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి : ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/ఎల్ బినగర్:** నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ సాయినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాఖ్యన్ ప్లే స్కూల్ ని స్థానిక ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. వ్యాఖ్యన్ ప్లే స్కూల్ నిర్వాహకురాలు మధుమతి ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డినికి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దే అటువంటి ఒక మంచి అవకాశాన్ని మీరు ఎంచుకున్నందుకు వారి భవిష్యత్తును తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలను అధిరోహించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు వర ప్రసాద్ రెడ్డి,కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం ధర్మకర్త మధుసాగర్, కాలనీ వాసులు సత్యనారాయణ గౌడ్, అనిల్ రెడ్డి,కొండల్, సతీష్ పాల్గొన్నారు.

## నేడు పశుపోషణపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** పివి నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండలి(ఎన్‌పీసీ) ఆధ్వర్యంలో సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఈనెల 22వ తేదీన పశు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత పెంపొందించటంలో సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతులు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు జరగుతుందని పశు సంవర్ధక విస్తరణ విభాగం అధిపతి ప్రొపెసర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా స్థానిక విస్తరణ విద్యా సంస్థ(ఈఈఐ) ఆడిటోరియంలో జరిగే సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు.పీవి నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయ పరిశోధన విద్యార్థులు,అధ్యపకులు,తెలంగాణ పశు సంవర్థక శాఖాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈసదస్సులో డా. రాజీవ్ రంజన్,డైరెక్టర్ డా.యం.జ్ఞానప్రకాష్,విశ్వ విద్యాలయ డీన్ డా.టీ.రఘు నందన్,డాబి. హెమంత్,డైరెక్టర్ డా.ఉదయ్‌కుమార్ తదితరులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి

**ప్రజాపక్షం/షాబాద్:** దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ గ్రామంలోని మల్లన్న దేవాలయా నిర్మాణంకు రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలందరూ దేవాలయ సన్నిదిలో ఆధ్యాత్మిక చింతనతో దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు పోన్న నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

## విజయవంతంగా కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కోపింగ్ వర్క్‌షాపు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్ఐఆర్‌డి అండ్ పిఆర్) యందు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌లో కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కోపింగ్ వర్క్‌షాపు గురువారం విజయవంతమైంది. ఈవర్క్‌షాపును ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎన్ఐఆర్‌డి అండ్ పిఆర్ డైరెక్టర్ జనరల్ డా.జి.నరేంద్ర కమార్ (ఐఏఎస్) హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాచరణ సామర్థ్యం, ప్రభావం , జవాబుదారితనం మెరుగు పర్చటానికి ఆర్‌డీ అండ్ పీఆర్ ఏ1 యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పారు. చివరికి మెరుగైన సేవా బట్వాడా , ప్రజల విశ్వాసాన్ని పెంపొందించారు. ఈవర్క్‌షాపు యందు డా.చంద్రశేఖర్ కుమార్ పాల్గొని పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాముఖ్యత గురించి వివరించారు.విశ్రాంత ఐఏఎస్ ప్రకాష్ కుమార్,వాధ్వాని సెంటర్ సీఈవో డా.ఈజీ రాజన్,పెంటగ్రామ్ గ్రూఫ్ అఫ్ కంపనీస్ చైర్మెన్ ప్రొపెసర్ కెఎస్ రాజన్,హైదరాబాద్ ఐఐఐటీ ప్రొపెసర్ ఎస్.రవీంద్రలు ప్రొసెసర్ ఎన్ఐఆర్‌డి అండ్ పీఆర్ వివిధ సాధనాలు,నామునాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమానికి అసోషియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ సెంటర్ ఫర్ ఐసీటీ డాక్టర్ ఎంవి.రవి బాబు సమన్వయ కర్తగా వ్యవహారించారు.

# త్వరగా టీమ్స్ హాస్పిటల్ పనులు

### రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కొత్తపేటలో నిర్మిస్తున్న టీమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించడం జరిగింది. ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టీమ్స్ హాస్పిటల్ పనులను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు, వైద్య ఆరోగ్య జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. టీమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్ అండ్ టి ఇంజనీర్స్ వివరించారు. నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.హాస్పటల్ నిర్మాణ పనుల పురోగతి పై ఆరా తీస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రటరీ ఆదేశించారు. ఈ పర్యటనలో వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ,డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టీమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్,రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వర్ రావు, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, ఇబ్రహీంపట్నం ఆర్ డి ఒ అనంత రెడ్డి,తహాశీల్దార్లు జానకి,విజయలక్ష్మి,ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## వైద్యశాలలు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్ లేకుంటే చట్టప్రకారం చర్యలు

### హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం హైదరాబాద్ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఆయుష్ క్లినిక్‌లు, పాలిక్లినిక్‌లు, హాస్పిటళ్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఆయుష్ లేదా అలోపతి డయాగ్నస్టిక్ సెంటర్ల ఏవైనప్పటికీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేనిపక్షంలో క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్ తెలియజేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి ఈ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలియజేశారు. ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియో వైద్యంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వెనక ఏరియాలో ఉన్నటువంటి తెలంగాణ ప్రభుత్వ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చట్ట ప్రకారం అర్హులని డాక్టర్ వెంకటి తెలియజేశారు. ఆ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నవారు మాత్రమే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారంలో పేర్కొన్న అన్ని సర్టిఫికెట్లను జతపరిచి సికింద్రాబాద్ ప్యాట్నీలోని హైదరాబాద్ జిల్లా డి.ఎం. హెచ్.వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించినట్లయితే 10 రోజులలో తాత్కాలిక సర్టిఫికెట్లను అందజేస్తామని డాక్టర్ వెంకటి వివరించారు. అనంతరం జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.hyderabad. telangana. gov.in నందు జారీ చేసిన సర్టిఫికెట్లను ప్రదర్శిస్తామని, అంతేకాకుండా జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నోటీస్ బోర్డ్ లో వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు. ఫిర్యాదులు లేని పక్షంలో 45రోజులలో తనిఖీ బృందాలతో తనిఖీ చేయించి నివేదిక అందిన తర్వాత పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (5సంవత్సరాలకు) సర్టిఫికెట్లు జారీ చేస్తామని డాక్టర్ వెంకటి తెలిపారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక




**ప్రజాపక్షం /రంగారెడ్డి ప్రతినిధి:** ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ శశాంక రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నేపథ్యంలో స్వీప్ పై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేల అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన వారు విధిగా ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చేవెళ్ళ,మహేశ్వరం, రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లి,పరిగి, తాండూర్,వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటాయని,అందులో ఎక్కువ నియోజక వర్గాలు అర్బన్ ప్రాంతంలో ఉన్నందున ఓటింగ్ శాతం తక్కువ నమోదు అవుతుందని గుర్తు చేశారు.ఆయా ప్రాంతాలలో ఉన్న కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు.ప్రజలలో చైతన్యం తెచ్చేందుకి 5కె రన్ నిర్వహించాలని, వాల్ పోస్టర్స్ ద్వారా, ప్రచారం చేయాలని అన్నారు.గ్రేటర్ కమ్యూనిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచాలన్నారు.మహిళా సంఘాల ద్వారా, విద్యార్థుల ద్వారా వారి కుటుంబాలలో ఓటుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా విద్యా శాఖ అధికారి సుసింధర్ రావు,జెడ్.పి సిఇఒ కృష్ణారెడ్డి,జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీలత,డిపిఒ సురేష్ మోహన్,జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

## రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

### కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మధ్యాహ్నభోజన కార్మికురాలు అనసూయ కుటుంబానికి ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి మధ్యాహ్న భోజన కార్మికురాలు అనసూయ హఠత్ మరణం చెందిందని, కార్మికురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ 13ఏళ్ళుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్నారని, ఉన్నఫలంగా ఒక్కసారి ఆకస్మాత్తుగా మృతి చెందడం కార్మిక లోకానికి తీరని లోటని వివరించారు. ఎన్నో పోరాటాలు చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అయినా వారి సమస్యను పట్టించుకొని పరిష్కరించేందుకు కృషి చేయడంతోపాటు పిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనంతో కార్మికురాలు పని చేసిందని, కనీసం ఇప్పుడైనా వేతనాలు పెంచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి గౌవర మండల అధ్యక్షుడు జి.వెంకటేష్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు బాలరాజ్, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్, ఏఐటియుసి మండల కన్వీనర్ చోటేమియా, నాయకులు రమేష్, శేఖర్‌లు ఉన్నారు.

**మధ్యాహ్న భోజన కార్మికురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : పానుగంటి పర్వతాలు**

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేందుకు కృషి చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు గుండెపోటుతో మరణించడం ఎంతో బాధాకరమైన విషయమని, ప్రభుత్వం వారి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు అన్ని విధాల ఆదుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం : నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా పెద్ద మొత్తం లాభాలు ఆర్జించవచ్చని నమ్మించి మోసం చేసిన కేసులో హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా ఈ సంఘటనలో ఇద్దరు పరారీలో ఉన్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళితే....హైదరాబాద్ నివాసి నుంచి గతనెలలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఒక ఫిర్యాదు అందింది. ఉప్పల్‌కు చెందిన తమనం సురేంద్ర, దామచర్ల నరేష్‌బాబు అనే నిందితులు ఫిర్యాదు దారుకు వాట్సాప్ ద్వారా పరిచయమయ్యారు. కొద్ది మొత్తం డబ్బును ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడిగా పెడితే మంచి లాభాలే వస్తాయని నమ్మించి ఈ వ్యాపారంలోకి దించారు. అతడిని గోల్డ్‌మెన్ (ఇండియా) శాక్స్ సెక్యూరిటీస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అనే వాట్సాప్ గ్రూప్‌లో అతడిని చేర్చారు. మోసపోయిన ఈ ఫిర్యాదుదారుకు వారు ఒక లింక్‌ను పంపించారు. ఫిర్యాదుదారు వారిని నమ్మి ఆ లింక్‌పై క్లిక్ చేశాడు. టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టాడు. అతడు రూ.57లక్షల 37వేల 536 మేరకు పెట్టుబడి పెట్టేలా నమ్మిస్తూ పెట్టుబడి మొత్తానికి ఎలాంటి చెల్లింపు చేయకుండా మభ్యపెడుతూనే ఉన్నారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గ్రహించిన సదరు ఫిర్యాదుదారు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిబ్రవరి నెలలో ఫిర్యాదు చేయడంతో వారి మోసం బట్టబయలైంది. కాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ ఏసిపి ఆర్.జి.శివమారుతి పర్యవేక్షణలో ఎస్.మట్టంరాజు సారథ్యంలోని బృందం నిందితులనుంచి ల్యాప్‌టాప్, రెడ్మీ ఫోన్లను స్వాధీనం చేసుకుని బుధవారం ఇద్దరు నిందితులైన తమనం సురేంద్ర, దామచర్ల నరేష్‌బాబును అరెస్ట్ చేసింది. పరారీలో ఉన్నవారికోసం గాలింపు జరుగుతోందని హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ డి.కవిత మీడియాకు వెల్లడించారు.

## ఐదేళ్ళలో కోటి మొక్కలు నాటుతాం : సుధారెడ్డి



**హైదరాబాద్ :** రానున్న ఐదు సంవత్సరాల్లో దేశ వ్యాపితంగా కోటి మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎం ఈ ఐ ఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ తో పాటు దేశంలోని జాతీయ రహదారులు, విద్యా సంస్థలు, ప్రార్ధనా మందిరాలు, ఆసుపత్రులు , ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటుతామని తెలిపారు. మానవ జీవితంలో అంతర్భాగమైన ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో ప్రజల పాత్ర అత్యంత ముఖ్యమైందని సుధారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్ ) ఫౌండేషన్, సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుంచి మొక్కలు నాటటం వేగవంతం చేస్తామని తెలిపారు. తొలి ఏడాది దేశ వ్యాపితంగా వెయ్యి కి లోమీటర్ల పరిధిలో పది లక్షల మొక్కలు నాటుతామని తెలిపారు. ఐదు సంవత్సరాల్లోకోటి మొక్కలను నాటుతామని తెలిపారు.

# బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నెగ్గిన అవిశ్వాసం

### ఒకేతాటిపై ఉండి పంతం నెగ్గించుకున్న 16 కార్పొరేటర్లు
### న్యాయం గెలిచిందని వ్యాఖ్య
### అవిశ్వాసానికి మేయర్‌తో సహా నలుగురు కార్పొరేటర్లు గైర్హాజరు



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒంటెద్దు పోకడలకు పోతున్నడని, కార్పొరేషన్‌లో వందల కోట్లు అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను ఎదుర్కొంటున్న మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ వ్యతిరేక వర్గం 16 మంది కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం నెగ్గింది. ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన ఈ అవిశ్వాస తీర్మానంలో మొదటి నుంచి 16 మంది కార్పొరేటర్లంతా ఒకే మాటపై ఉండి 72 రోజులుగా అవినీతి మేయర్‌పై పోరాడి తమ పంతం నెగ్గించుకున్నారు. 16మంది సభ్యులు కోర్టులో వేసిన అప్పిల్ ప్రకారం కోర్టు ఆదేశాల మేరకు అవిశ్వాస తీర్మాణానికి హాజరు కావాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బిజెఎంసి అధికారులు కార్పొరేటర్లందరికీ నోటీసులు జారీ చేయగా 16 మంది కార్పొరేటర్లు హాజరైయ్యారు. గతంలో పెట్టిన అవిశ్వాస తీర్మానం రోజును కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్న మేయర్ ఈసారి చేసేది ఏమి లేక పోవటం, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మేయర్ వేసిన పాచికలు పారలేదు. దీంతో ముందుగాను ఉహించిన మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ ఆయనకు మద్దతుగా ఉన్న నలుగురు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మాణానికి హాజరు కాకుండా తోకముడిచారు. అవిశ్వాస తీర్మానానికి సైతం హాజరు కాకుండా మొఖం చాటేసిన మేయర్ బుర్ర మహేందర్ గౌడ్,కార్పొరేటర్లు గోకరి శ్రీలత సురేష్ గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్,సాగర్‌గౌడ్, పద్మావతి పాండులు అవిశ్వాస తీర్మాణానికి హాజరు కాకపోవటంతో ఎన్నికల అధికారి రాజేంద్ర నగర్ డివిజన్ ఆర్‌డిఒ కొప్పుల వెంకటొరెడ్డి ఎన్నికలు నిర్వహించారు. ఈ అవిశ్వాస తీర్మానానికి హాజరైన 16మంది తమ చేతులు ఎత్తి అవిశ్వాస తీర్మానం నెగ్గించకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి ఆర్‌డిఒ కొప్పుల వెంకట్‌రెడ్డి,బిజెఎంసి కమిషనర్ బి.శరత్ చంద్రతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**16మంది అనుకూలంగా ఓట్లు వేశారు : ఆర్‌డిఒ కొప్పుల వెంకట్‌రెడ్డి**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్‌పైన జరిగిన అవిశ్వాస తీర్మానంపైన 16 మంది కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంలో 16మంది ఓట్లు వేయటంతో వారి తీర్మా నం నెగ్గింది. ఈనాటి అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరు కావాలని నోటిసులు అందుకున్న 21మంది సభ్యుల్లో మోజార్టీ సభ్యులు 16 మంది హాజరు కాగా మిగతా వారు హాజరు కాలేదు. గురువారం జరిగిన మినిట్స్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపుతాము. ఆ తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్ ఎన్నిక ఉంటుంది.

**లతా ప్రేమ్‌గౌడ్‌ను మేయర్‌గా ఎన్నుకుంటాం : డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి**

బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్‌కు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే నూతన మేయర్‌గా లతా ప్రేమ్ గౌడ్‌ను 16మంది కార్పొరేటర్లంతా కలిసి ఎన్నుకుంటాం.గత రెండు నెలలుగా రాజ్యంగం కల్పించిన మాహక్కులపై మేమంత సమష్టిగా పోరాడి మేయర్ అడ్డదారిలో వెళ్లి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్న ఒంటెద్దు పోకడలు పోయిన,అవినీతి మేయర్ బుర్ర మహేందర్ గౌడ్‌ను గురువారం మేయర్ సీటు నుంచి గద్దెదించాం. కార్పొరేషన్ అభివృద్ధికి తామంత చర్చించాకే తాము ఏపార్టీలో చేరేది నిర్ణయం తీసుకుంటాం.

**వందల కోట్ల అభివృద్ధిని బయట పెడతాం : నూతన మేయర్ లతా ప్రేమ్‌గౌడ్**

గత నాలుగేళ్లకు పైగా మేయర్ పీఠంపై ఉన్న బుర్ర మహేందర్ గౌడ్ బిజెఎంసిలో వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని వాటిన్నింటిని ఆధారాలతో సహా బయటకు పెడతాంనూతన మేయర్ ల తా ప్రేమ్‌గౌడ్ అన్నారు. మేము 16 మందిమి ప్రస్తుతం ఏపార్టీలో లేము. మేమంతా ఏ పార్టీలో ఉండాలో నిర్ణయం తీసుకుని ఆ పార్టీలో చేరుతాం.

**బొర్రా జ్ఞానేశ్వర్‌ను కలిసిన కార్పొరేటర్లు**

బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్‌లో మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ వ్యతిరేక వర్గం 16 మంది కార్పొరేటటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం నెగ్గిన అనంతరం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లంతా కలిసి నూతన మేయర్‌గా బండ్లగూడ 17 డివిజన్ కార్పొరేటర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.అనంతరం వారంత కలిసి బండ్లగూడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో అపరేటివ్ చైర్మెన్ జ్ఞానేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. గత 72రోజులుగా 16 మంది కార్పొరేటర్లు ఏకతాటిపై నడిచి అవిశ్వాస తీర్మాణంలో నెగ్గి విజయం సాధించిన కార్పొరేటర్లను బొర్రా జ్ఞానేశ్వర్ ఘనంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## సిఎం సహాయనిధి అందజేత



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ నగర పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ 17వ డివిజన్‌కు చెందిన షేక్ ముస్తాక్ అహ్మద్ కుమారుడు మాజుల్ సమద్ వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసిని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ గురువారం అందజేశారు. సమద్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం సిఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా బోడుప్పల్ 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి చొరవతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి రూ.80వేల సహాయాన్ని వజ్రేష్ యాదవ్ మంజూరు అయ్యే విధంగా కృషిచేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలో మెడిసిటి ఘనపూర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శామీర్‌పేట మునిసిపల్ బిల్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కారోబార్ రంజిత్, అభిలాష్, డాక్టర్లు ఓమార్, అభిషేక్, వైభవి, దివ్య, సమ్రాన్, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ కుమారస్వామి, నాగార్జున, పూజ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటితో సాగును అడ్డుకోండి

ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్ :** హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో కాలుష్యమైన చెరువుల నీటితో ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయడాన్ని అడ్డుకోవాలని రాష్ట్రానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి కూరగాయల వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి అలాంటి కూరగాయలు మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు జిల్లాల పరిధిలోని 13 చెరువుల దుస్థితిపై అడ్వొకేట్ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని చెరువుల దుస్థితిపై 2007లో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని గతంలో విచారించిన ధర్మాసనం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించింది. చెరువులు ఆక్రమణలు వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్, న్యాయవాది టి శ్రీకాంత్ రెడ్డిలతో కూడిన అడ్వొకేట్ కమిషన్ నివేదిక ఇచ్చింది. రెండు జిల్లాల్లోని 13 చెరువుల వారీగా సమగ్ర నివేదిక అందజేసింది. చెరువుల ఆక్రమణలను తొలగించాలని, చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా చేయాలని, చెరువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువులకు పెన్సింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి పునరుద్ధరణ చర్యలు తీసుకుని వాటి ఫొటోలతో సహా ఏప్రిల్ 23లోగా కార్యాచరణ నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఘనంగా మద్దూరి అన్నపూర్ణయ్య 125వ జయంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం జైలు జీవితం గడిపి, తనజీవితాన్ని ప్రజలకోసం అర్పించిన మహనీయుడు మద్దూరి అన్నపూర్ణయ్య చిరస్మరణీయుడని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రనేతాజీ మద్దూరి అన్నపూర్ణయ్య 125వ జయంతి సందర్భంగా స్థానిక జెండా పంజా రోడ్డులోని మద్దూరి అన్నపూర్ణయ్య విగ్రహానికి శ్రీమద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి ఆధ్వర్యాన పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశంనగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సభలో 2024 సంవత్సరానికిగాను మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డును రిటైర్డ్ హెడ్‌మాస్టర్ అర్.వి.చలపతికి, ఆధ్యాత్మిక, సామాజిక సేవవేత్త అంబటి భీమశంకర నారాయణ సాయిబాబా తదితర సంఘ ప్రముఖులకు ప్రదానం చేశారు. నూట 50 మందికి పైగా మునిసిపల్ టౌన్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్న ఈ జయంతి సభ అత్యంత వైభవంగా జరిగింది.

ఎలక్షన్ కమిషనర్ల నియామకంపై

## స్టేకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి కేంద్రం ప్రభుత్వం చేసిన ఇద్దరు కమిషనర్ల (ఇసిల) నియామకంపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు గందరగోళం సృష్టించే అవకాశం ఉన్నందున, ఈ దశలో ఇసిల నియామకాలకు సంబంధించిన చట్టంపై స్టే ఇవ్వలేమని గురువారం తెలిపింది. 2023 లో కేంద్రం రూపొందించిన కొత్త చట్టంలో ఎన్నికల కమిషనర్ల నియమించే ప్యానెల్ నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. దీనిపై ఒక స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. కొత్త ఇసిలనియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. పూర్తి వివరాలతో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని పిటిషనర్లకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం సూచించింది. 2023 చట్టం ప్రకారం చేసిన నియామకాలపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన ధర్మాసనం, 'సాధారణంగా, మేము మధ్యంతర ఉత్తర్వుల ద్వారా చట్టంపై స్టే ఇవ్వము' అని తెలిపింది. కాగా, ఈ ఏడాది మార్చి 21న ఈ పిటిషన్లపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సర్వీసు నిబంధనలు, పదవీ కాలం) చట్టం 2023లో స్పష్టమైన ఉల్లంఘన జరిగిందని పిటిషనర్ జయ ఠాకూర్ తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదించారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఎన్నికల కమిషన్ 'రాజకీయ', 'కార్యనిర్వాహక జోక్యానికి' దూరంగా ఉండాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కూడా కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల కమిషనర్ల సెలక్షన్ ప్యానెల్ నుండి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)ని మినహాయించడాన్ని ఎడిఆర్ సవాలు చేసింది. ఇలావుంటే, ఇటీవల మాజీ ఐఎఎస్ అధికారులు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధులను కేంద్రం ఇసిలుగా నియమించిన నేపథ్యంలో, ఈ విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్యానెల్ వీరిని ఎంపిక చేసింది. ఫిబ్రవరి 14న అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ, అనంతరం అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాతో ఇసిఐలో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం 2023లోని సెక్షన్ 7 ప్రకారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి), ఇసిలను ఎంపిక చేసే ప్యానెల్ నుంచి సిజెఐని మినహాయించారు. ఈ సెక్షన్ అమలుపై స్టే విధించాలని ఎడిఆర్ తన పిటిషన్‌లో చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించింది.

ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుపై

## సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ:** ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుపై సుప్రీం కోర్టు స్టే విధించింది. కేంద్ర ప్రభుత్వంపై వస్తున్న వార్తల్లో నిజానిజాలను పరిశీలించి, తప్పుడు వార్తలను కనిపెట్టడానికి వీలుగా ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సియు)ను కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ (ఇఎఐటి) బుధవారం నోటిఫై చేసింది. ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్టు ఇఎఐటి శాఖ 2021, మార్చి 20న నోటిఫై చేసింది. అయితే, ఎఫ్‌సియును వ్యతిరేకిస్తూ బొంబాయి హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ యూనిట్ నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను బొంబాయి హైకోర్టు కొట్టివేసింది. దీనితో పిటిఇషనర్లు ససుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్న సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించింది. డిజిటల్ మీడియా మార్గదర్శాలకు సంబంధించిన రూల్ 3(1)(బి)(5) ప్రకారం ఈ నోటిఫికేషన్ చెల్లదని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, ఇతరత్రా అంశాలకు సంబంధించిన సమాచారానికి ఎఫ్‌సియు వల్ల గండిపడుతుందన్న పిటిషనర్ల వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.

# ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తే విజయం సులభమే

సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమావేశం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించిన బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులను ఎదుర్కొని మల్కాజిగిరి స్థానంలో మరో సారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధీటుగా మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకొని వ్యూహం సిద్ధం చేశారు. దీనిలోని భాగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల మేరకు గురువారం మల్కాజిగిరి పార్లమెంటు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ప్రధాన నేతలు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర నేతలు మధు యాష్కి, పట్నం మహేందర్‌రెడ్డిలతో వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసారు. ఇప్పటి వరకు అధిష్టాన వర్గం మల్కాజిగిరి స్థాన నుండి పోటీ చేసే అభ్యర్థిని అధికారికంగా ప్రకటించక పోయినప్పటికి ఇటీవలే బిఆర్ఎస్ ను విడి కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జడ్‌పి చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డిని సైతం ఈ సమావేశానికి తీసుకొని వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి ఆమెను ఖరారు చేసినట్లు అనధికారికంగా పార్టీ శ్రేణులకు పరిచయం చేసారు.


### ఉదయం నుండే ఇక నేతలు, కార్యకర్తలు బస్తీ బాట పట్టాలి

ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పరాజయం పాలైనా ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి ప్రజల్లో తమ పార్టీపై పెరుగుతున్న ఆదరణ పెరుగుతుండటం ఆశాజనకంగా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ సెంగ్మెంట్లతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందేలా ప్రణాళికాయుక్తంగా ప్రజలతో మమేకం కావాలన్నారు. దీని కోసం అన్ని ప్రాంతాల్లోనూ ప్రతి కార్యకర్తతో సయోధ్యను పెంచుకొంటూ నేతలు బస్తీ బాట పట్టాలని ఆదేశించారు. తమ ప్రచారంలో గత ప్రభుత్వ వైఫల్యాలతో పాటు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా పాలన ద్వారా అందిస్తున్న ఆరు గ్యారంటీల పథకాలన్నింటిని వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకానికి 10 లక్షలకు పెంపు, రూ.500లకే అందిస్తున్న గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మూడు మాసాల్లో ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం లాంటి పథకాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ కలిసి కట్టుగా ఇక్కడి 2964 బూత్‌లలో ఒక్కో బూత్‌ను ఒక్కో కార్యకర్త సైనికుడిలా పని చేస్తూ ముందుకు వెళితే విజయం సులభమవుతుందన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసే వారికి ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తాను తీసుకొంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తానిప్పుడు సిఎం స్థానాన్ని పొందటానికి తనను మల్కాజిగిరి ప్రజలు నాడు ఎంపిగా ఆశీర్వదించి గెలిపించటమే అని, ఈ ప్రాంతంలో మెట్రో, ఎంఎంటిఎస్, రావాలన్నా, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, సైవేల నిర్మాణం లాంటి అనేక అభివృద్ధి పనుల బాధ్యత తాను స్వయంగా తీసుకొంటానని, మల్కాజిగిరి ఎంపిగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తా, నాయకులు తమ భుజస్కందాలపై తీసుకోవాలన్నారు.

### ఎంపి అభ్యర్థిగా సునీతా మహేందర్‌రెడ్డి

ఎలాగైనా తన మల్కాజిగిరి పార్లమెంటు సిట్టింగ్ స్థానాన్ని పదిల పరుచుకోవటంలో భాగంగా ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని బలమైన అభ్యర్థిని బరిలోకి దించే యత్నాలతో మారుతున్న రాజకీయ సమీకరణాలతో వికారాబాద్ జడ్‌పి చైర్మన్‌గా కొనసాగుతూ కొద్ది రోజుల క్రితమే కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డిని గురువారం నాటి మల్కాజిగిరి పార్లమెంటు కార్యకర్తల సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి ఇతర నాయకులతో పాటు తీసుకొని రావటం, ఆమె పేరు ఇటీవలి కాలంగా ఎంపిక చేస్తున్నట్లు వినిపిస్తున్న వార్తలతో అనధికారికంగా ఖరారు చేస్తున్న విషయాన్ని ఆయన ప్రకటించినట్లే పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్‌పి చైర్మన్‌గా పని చేసిన సమయంలో ఆమెకు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లతో పరిచయాలు ఆమె విజయానికి తోడవుతాయనని భావిస్తున్నారు.

### సునీతారెడ్డి రాజకీయ ప్రస్థానం



దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతా రెడ్డి ఖరారైంది. గురువారం మల్కాజిగిరి పార్లమెంటు క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆమెను పరిచయం చేశారు. తన భర్త మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో పాటు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరిన ప్రస్తుత వికారాబాద్ జడ్‌పి చైర్మన్‌గా కొనసాగుతున్న పట్నం సునీతారెడ్డి రాజకీయ ప్రస్థానం ఇలా ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన పట్నం మహేందర్‌రెడ్డి అడుగుజాడల్లో ఆయన భార్య పట్నం సునీతారెడ్డి రాజకీయాల్లో ప్రవేశించి 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున బంట్వారం జడ్‌పిటిసిగా ఎన్నికై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైంది. ఆమె ఆ తర్వాత భర్తతో పాటు టిఆర్ఎస్ పార్టీలో చేరి 2014లో యాలాల జడ్‌పిటిసిగా మరో సారి ఎన్నికై రెండో సారి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా ఎన్నికైంది. 2019లో మరోసారి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ పక్షాన కొట్‌పల్లి జడ్‌పిటిసిగా ఎన్నికై మూడవ సారి కొత్తగా ఏర్పడిన వికారాబాద్ జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి చేపట్టి ఇప్పటికీ ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024లో మర్పల్లి మండలం పట్లూరులో ఆమె వాహనాన్ని అడ్డుకొని వీరంగం చేసిన ఘటనలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారన్న విషయం పార్టీ అధిష్టానవర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవటం, జిల్లాలోని టిఆర్ఎస్ పార్టీ నేతల గ్రూపు రాజకీయాలతో విసుగు చెందిన ఆమె భర్తతో పాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాకా మారిన రాజకీయ సమీకరణాలతో ఆమె తన భర్త ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కల్సి బిఆర్ఎస్ పార్టీకి గత నెల 16న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో పార్టీ బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కల్సి ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

## ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు

బిసి కులాల ఐక్యవేదిక వినతి



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని జ్యోతినగర్ దోబిఘాట్లో ఏర్పాటు చేసిన వీరనారి, సబ్బండ వర్గాల ఆశ జ్యోతి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దోభిఘాట్ రజక సంఘం, మల్కాజ్‌గిరి నియోజకవర్గం బిసి కులాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గత పది రోజుల కిందట ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు, జిల్లా కలెక్టర్, ఆర్‌డివో, ఎమ్మార్వో, మున్సిపల్ డిసిలకు చాలా సార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కాగా గురువారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిసికి వినతిపత్రం అందజేశారు. డిసి సానుకూలంగా స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రజక సంఘాలు, బిసి సంఘాల ఆధ్వర్యంలో అన్ని పార్టీలను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల ఐక్యవేదిక మల్కాజ్‌గిరి నియోజకవర్గం అధ్యక్షుడు కామల్ల ఐలన్న, ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, రజక సంఘం అధ్యక్షుడు పి.పాండు, ప్రధాన కార్యదర్శి ముదిగొండ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ కాసర్ల నాగరాజు, పి.లక్ష్మీ నారాయణ, వి.ప్రవీణ్, వై.యాదగికి తదితరులు పాల్గొన్నారు.

## వాల్‌రైటింగ్, పోస్టర్ల తొలగింపు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో ఆగమేఘాలపై పోస్టర్లను తొలగించిన సిబ్బంది



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులైనా గోడలపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు తొలగించలేదన్న ప్రజాపక్షం వార్తకు పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ గౌతం సీరియస్ అయ్యారు. సంబంధింత అధికారులు అన్ని సెంగ్మంట్లలోనూ ఎక్కడ కనిపించినా రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సంబంధిత పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు, హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలంటూ ఆదేశించారు. దీంతో గురువారం నాడు ప్రచురితమైన. ఫొటో ఆధారాలతో సహా వచ్చిన కథనం మేరకు సిబ్బంది ఈసిఐఎల్ ప్రధాన రహదారిలో ఉన్న రౌండ్ బిల్డింగ్ భవనంపై ఉన్న వాల్ రైటింగ్‌లు, పోస్టర్లను పూర్తిగా తొలగించారు. కాగా ఇప్పటికీ మహేష్‌నగర్, ఎస్‌రావు నగర్, కాప్రా లాంటి పలు ప్రాంతాల్లో ఉన్న పోస్టర్లను తొలగించటంలో సంబంధింత సిబ్బందిని మరింత అప్రమత్తం చేయాలంటూ పలువురు కోరుతున్నారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## ఉద్యమకారుడు శేఖర్‌గౌడ్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యమకారులను అసభ్య పదజాలంతో దూషించిన బిఆర్ఎస్ నాయకుడు పరశురాంరెడ్డిని ప్రశ్నించినందుకు ఉద్యమకారుడు శేఖర్‌గౌడ్‌ను నోటికొచ్చినట్లు దూషించాడని పలువురు నేతలు శేఖర్‌గౌడ్‌ను గురువారం కలిసి సంఘీబావం తెలిపారు. 137 పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో వాయిస్ మెసేజ్‌లతో వీలుకాని భాషలో పరశురాంరెడ్డి దూషించారని వారు వాపోయారు. గతంలో నీ కాళ్లు విరగ్గొట్టించాను, అయినా నీకు బుద్ధి రాలే దు, త్వరలో నీ అంతు చూస్తానంటూ బెదిరిస్తూ శేఖర్ గౌడ్‌ను హెచ్చరించాడు. ఈ విషయం తెలుసుకున్న పలువురు శేఖర్ గౌడ్ నివాసానికి వచ్చి సంఘీభావం తెలిపారు. తాము పరశురాంరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి గౌడ్, గోపాల్ ముదిరాజ్, గోపి యాదవ్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, సుధాకరాచారి, సాగర్ గౌడ్, హేమంత్ చౌదరి, స్వామిగౌడ్, కుమార్, మచ్చేందర్, రంజిత్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

## బిజెపితోనే దేశాభివృద్ధి : కొండా



**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజాధనాన్ని దోచుకునడంలో నెంబర్ వన్ అని అందరికీ తెలిసిన విషయమేనని, దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బిజేపీ ఒక్కటేనని చెవెళ్ళ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం బుగాపూర్ గ్రామంలోని డిఎంఆర్ పంక్షన్ హాల్‌లో బిజేపీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు ప్రజల సోమ్మును దోచుకుని తమ కుటుంబాలను బంగారు మయం చెసుకుంటారని, బీజేపీ మాత్రం నిస్వార్థంగా పని చేసి దేశం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందని అన్నారు. గత పది ఏళ్ళ నుండి స్వార్థపాలన చేసిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నో స్కాములు చేసి నేడు జైలుకు వెల్తున్నారని అందిరికీ తెలుసని అన్నారు. దేశం, రాష్ట్రం బాగుపడాలంటే బీజేపీని గెలిపించాలని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కోట్‌పల్లి మండలంలోని కోట్‌పల్లి, బుగాపూర్, కొత్తపల్లి, రాంపూర్, మోత్కుపల్లి, బార్వాద్, తండా తదితర గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఇతర పార్టీ నుండి బిజేపీలో చేరారు. కార్యక్రమంలో మాదవ్‌రెడ్డి, చెవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, తదితరులున్నారు.

## శ్రీనివాస్ మృతికి కారకులపై చర్యలు

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వినతి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని పరిగి మున్సిపల్‌లోని యాసీస్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు ఆర్ఎంపి డాక్టర్ గాఫర్‌వద్ద శ్రీనివాస్ అనే యువకుడు చాతి నోప్పి అని చెప్పగా వైద్యము చేసి ఎక్కువ మోతదులో మందు ఇచ్చిన ఐదు నిమిషల్లో యుకుడు అక్కడిక్కడే కుప్పకూలి మృతి చెందడం జరిగింది. ఆర్ఎంపి తన పరిధిని మించి వైద్యం చేయడం వల్లనే శ్రీనివాస్ మృతి చెందడం జరిగింద గతంలో గఫర్ వల్లనే ఒక మహిళ మృతి చేందిందని వరుస మరణలు సంభవించడంతో ఆర్ఎంపి సెంటర్‌ను సీజ్ చేసి ప్రజల మరణలాలకు కారణమవుతున్న గఫర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. జిల్లా వైద్యఅధికారి పల్వాన్ కుమార్‌కు వినితపత్రం ఇచ్చి శ్రీనివాస్ కుటుంబన్ని కపడలని అన్నారు. కార్యక్రమంలో మహేందర్ , రాములు ,శ్రీకంత్ తదితరులు పాల్గోన్నారు.

## మూడు నెలలు 30 వేల ఉద్యోగాలు

బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** నిరుద్యోగులకు 3 నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో ముఖ్య మంత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులను, తప్పులను సరిచేస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు తెలంగాణ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ ఏకతాటిపై ఉండి గెలిపిస్తామన్నారు. రేవంత్‌కు మల్కాజ్ గిరి పార్లమెంటు సీటును గెలిచి బహుమతిగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## వేతనాలు చెల్లించాలని వినతి



**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** గత ఐదు నెలల నుండి పంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వక తమ కుటుంబాలను సాగదీయలేకపోతున్నాయని పంచాయతీ కార్మికులు అవేధన వ్యక్తం చేశారు. తమ వేతనాలను చెల్లించాలని కార్యాలయాల చుట్టురా తిరిగినా అధికారులు తమను పట్టించుకోకపోవడం బాధకరంగా ఉందని, కనీసం తమ వేతనాల గోడు అధికారులు పట్టించుకోవాలని గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే గ్రామాల్లోని సమస్యలు పడకేస్తాయని వెంటనే చెల్లించకుంటే గ్రామాల్లోని పారిశుధ్య పనులను నిలిపివేస్తామని అన్నారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇచ్చేంతవరకు తాము అండగా నిలుస్తామని గ్రామస్తులు మద్దతు తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలసిన టిపిసిసి ప్రధానకార్యదర్శి

కుమారుడి వివానికి ఆహ్వానం



**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, పెద్దేముల్ జడ్పీటిసి ధారాసింగ్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం సీఎం నివాసంలో తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డితో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పెద్దేముల్ జడ్పీటిసి ధారాసింగ్ కలిశారు. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డిని వారు శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జడ్పీటిసి ధారాసింగ్ తన కుమారు నవిన్ వివాహ ఆహ్వన పత్రికను సీఎంకు అందజేసి పెళ్ళికి ఆహ్వానించారు. సీఎంను కలసిన వారిలో యాలాల మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, ధారాసింగ్ కుమారుడు నవీన్ ఉన్నారు.



## వంశీచందర్‌రెడ్డి గెలుపు ఖాయం
### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వంశన్న కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను త్యాగం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ఆర్,బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో మాట్లాడి 160 పై చిలుకు కోట్ల బడ్జెట్ రావడానికి వంశన్న కృషి చేశారని అన్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మన మహబూబ్‌నగర్ అభ్యర్థి వంశన్న గెలిపించుకుంటే కేంద్ర ప్రభుత్వం నుంచి మన మహబూబ్‌నగర్ జిల్లాకు నిధులు తీసుకొచ్చి మన జిల్లాను అభివృద్ధి పథంలో ముందకు సాగడానికి కృషి చేస్తారని అన్నారు.వచ్చే ఎన్నికల్లో మన అభ్యర్థి వంశన్న ను భారీ మెజార్టీతో గెలిపించి రాహుల్ గాంధీ కి గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు.



## లింగాయత్ లింగ బలిజ బలోపేతానికి కృషి

ప్రజాపక్షం/ బాల్‌నగర్ : సమాజంలో లింగాయత్ లింగ బలిజల పాత్ర ఉందని,లింగాయత్ ల బలోపేతం కోసం కృషి చేద్దామని లింగాయత్ లింగ బలిజ ఉమ్మడి జిల్లా కమిటీ ఇన్చార్జి కొండ వీరన్న,మహబూబ్‌నగర్ అధ్యక్షులు సిద్ధి లింగం,జిల్లా అధ్యక్షులు శివకుమార్,కార్యదర్శి వినోద్ కుమార్,కోశాధికారి చంద్రశేఖర్ తదితరుల సమక్షంలో లింగాయత్ లింగ బలిజ మండల నూతన అధ్యక్షునిగా శరణయ్య,అధ్యక్షులుగా రాఘవేంధర్,ప్రధాన కార్యదర్శిగా మహేష్,కోశాధికారిగా బసవరాజ్ తదితరల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.అనంతరం మండలం మహిళా కమిటీ అధ్యక్షురాలుగా రాజేశ్వరి,అధ్యక్షురాలిగా సునీత,ప్రధాన కార్యదర్శిగా మమత,కోశాధికారిగా వసంత తదితర కమిటీ సభ్యులను మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగశ్రీ,ప్రధాన కార్యదర్శి శ్రీదేవి తదితరుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ..లింగాయత్ లింగ బలిజ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు లింగాయతుల అభ్యున్నతి కోసం పాటుపడుదామని తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## మైనార్ బాలిక అదృశ్యం



**ప్రజాపక్షం/అడ్డాకుల :** అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనార్ బాలిక అదృశ్యమైనట్లు ఆమె తండ్రి గురువారం అడ్డాకుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. బాలిక తండ్రి కర్ణాటకలో ఉంటుండగా కందూరులో తమ బాబాయి వద్ద తమ్ముడుతో కలిసి బాలిక ఉంటుంది. ఈ నెల 19న అడ్డాకులకు వెళ్లి దుస్తులు తెచ్చుకుంటానని చెప్పి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/అడ్డాకుల :** మండల కేంద్రంలో జాతీయ రహదారి 44పై గురువారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. అడ్డాకుల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి వెంకట్‌రెడ్డి 55 పొలం పనులు ముగించుకుని క్రాసింగ్ దగ్గర రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న షిఫ్ట్ కారు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యలో మృతి చెందారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసిన బాడీని బంధువులకు అప్పగించినట్లు అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో తీవ్ర విషాదాచాయాలు అలుముకున్నాయి.

## ప్రధాన పార్టీలు పునరాలోచించాలి




**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి :** త్వరలో జరగబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ అభ్యర్థులుగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు రెడ్డి వర్గానికి కేటాయించడం పట్ల బీసీ సమాజ్ అన్ని కుల సంఘాలను, ప్రజాసంఘాలతో కలిపి ఐక్యతతో ముందుకెళ్లి ఈ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో రుచి చూపిస్తామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా ఉన్న బీసీ జనాభాను విస్మరించి అన్ని పార్టీలు రెడ్డి అగ్రవర్ణాలకు కేటాయించారని బీసీ సమాజ్ తప్పు పడుతూ ఎందుకు బీసీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని బీసీల అభివృద్ధి,రాజ్యాధికారం కావాలంటే మన ఓట్లు మనమే వేసుకొని మన బీసీలను చట్టసభలకు పంపితే అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రధాన పార్టీలు 62 శాతం బీసీ జనాభా ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని బీసీలకే కేటాయించడం పై పునరాలోచించుకోవాలని బీసీ సమాజ్ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు చికినే మహేందర్,పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్,బిసి సామాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం,బిసి సమాజ్ దేవరకద్ర కన్వీనర్ బి.శేఖర్,బిసి సమాజ్ సభ్యులు ఆంజనేయులు సాగర్,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పదోతరగతి పరీక్షలలో మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఉపాధ్యాయులనుద్దేశించి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షకేంద్రంలోకివెళ్లి పరీక్షలు కొనసాగుతున్న తీరును ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటుచేశామని చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్‌కు తెలిపారు.

# దోపిడీ రాజ్యం పోయింది
### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** అరాచకాలు, ఆక్రమణలు, దోపిడి రాజ్యం పోయి, ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో జీవించే అవకాశం ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ కల్పించిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 12,26,33,45వ వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ మునీర్, కౌన్సిలర్ చిన్న, కౌన్సిలర్ ఉమర్‌తో పాటు 200 మంది నాయకులు, కార్యకర్తలు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత అరెస్టుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి అర్థం అయిందని, రాష్ట్రంలో కేసీఆర్‌తో పాటు ఓడజన్ మంది, ఇక్కడ మాజీ మంత్రి తో ఓ అరడజన్ మంది ఉంటారని తెలంగాణ గడ్డపై ఇంకా బిఆర్ఎస్ ఉండదని, గత ప్రభుత్వంలో పనిచేసిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసినటువంటి అరాచకాలు, అవినీతి పై చట్టబద్ధంగా చర్యలు ఉంటాయని తప్పకుండా వారు జైలుకు వెళ్లడం తథ్యం అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కూడా చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ పైన ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ, ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా దండుకోవడం దాచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి ఏమి లేదని, అభివృద్ధి మాటున అరాచకాలు, ప్రశ్నించిన వారిపై కేసులు తప్ప బిఆర్ఎస్ నాయకులు చేసిందేమిలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, కౌన్సిలర్ మునీర్, కౌన్సిలర్ తిరుమల వెంకటేశ్, మోతినగర్ కౌన్సిలర్ పాషా, కౌన్సిలర్ గిరి, కౌన్సిలర్ చిన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జీ సిజె బెనహర్, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బెక్కరి అనిత, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ ఫయాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, అన్వర్, మాజీ కౌన్సిలర్ బి.శివ శంకర్, తఖి, రమేశ్, మహ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ పట్టణంలోని 4వ వార్డు వినాయక నగర్‌కు చెందిన కొండ్రా చిన్న రంగన్న తండ్రి కొండ్రా నాగప్ప గత కొన్ని రోజులుగా కాలేయ వ్యాధి సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని ఏఐసీసీ కో ఆర్డినేటర్ , వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త డా. జిల్లెల్ల ఆదిత్యరెడ్డి పరామర్శించారు. విషయాన్ని పెబ్బేరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు యాదవ్ తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి బాధితునికి మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహయ నిధి నుంచి ఎల్ఓసీ ద్వారా రూ. 2 లక్షల 50వేల రూపాయలల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధితుని కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శాఖాపూర్‌లో 'పోషణ పక్షం'



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పోషణ పక్షం వేడుకలో భాగంగా మార్చి 9 నుంచి 23 వరకు పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం శాఖాపూర్ గ్రామంలో 1,2,3వ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సిడిపిఓ లక్ష్మమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ దేవి మాట్లాడుతూ గర్భిణీగా ఉన్నప్పటికి నుంచి చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం , ఆకుకూరలు , కూరగాయాలు , పాలు పండ్లు తీసుకోవడం గురించి గర్భిణీల కోసం ఆరోగ్యకరమైన ఆహార పద్ధతుల గురించి , ఆహార నియమాల గురించి ఆరోగ్య పరీక్షల గురించి అవగాహన కల్పించడం జరిగింది. తల్లిపాలు ఇవ్వడంపై పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టడం ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వడం ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం ఇవ్వడం , 24 నెలల వరకు తల్లిపాలు కొనసాగించడం గురించి తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, ఏఎన్ఎం దీవెనమ్మా, అంగన్‌వాడీ టీచర్స్ తిరుపతమ్మ, రమాదేవి, జయమ్మ, ఆశా కార్యకర్తలు , భారతి, సుకన్య, వీరమ్మ, సరితా, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధనపు కలెక్టర్ ఎం. నగేష్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రూట్ నిర్ధారణ కొరకు గురువారం ఉదయం పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల పరిధిలోని దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లను రూట్ వారిగా తిరుగుతూ పరిశీలించారు. పెబ్బేరు మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 196, 197, 198, 199, 200, 201, 202, 203, 204, 205, 242, 243లను శ్రీరంగాపురం మండల పరిధిలో 230, 231, 232, 237, 238, 239, 240, 241, 211, 212 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించారు. డూప్లికేట్ ఓట్లు ఏమైనా ఉన్నాయని బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన వారిని, దివ్యాంగుల పేర్లను జాబితాలో మార్కింగ్ చేయాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మి , ఆర్ఐ రవీందర్ , శ్రీరంగాపురం తహసీల్దార్ మురళి, ఆర్ఐ రాధా కృష్ణ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ?
### బిజెపి ఎంపీ అభ్యర్థి డి.కె. అరుణ

**ప్రజాపక్షం / కొత్తకోట :** గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఆరు గ్యారంటీల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ తాత్సారం చేస్తోందని మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డి.కె. అరుణ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని ఆరు గ్యారంటీల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినాక వాటికి తిలోదకాలిచ్చిందని ఆమె ఎద్దేవా చేశారు. గతంలో పాలమూరులో సాగునీటి కోసం రైతుల పక్షాన పోరాటం చేసిన ఘనత తనదేనని, కేంద్రంలో నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపిస్తే , కేంద్ర నిధులతో పాలమూరును అభివృద్ధి చేస్తానన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రానికి నిధుల కోసం కేంద్ర సహకారం కావాలని కోరుతున్నారని, కేంద్ర సహాయంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆమె అన్నారు.

## పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి




**ప్రజాపక్షం / పాన్‌గల్ :** గ్రామ పంచాయతీ వర్కర్స్ పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని శానిటేషన్ సామాగ్రి ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పాన్‌గల్ మండల కేంద్రంలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎదుట్ల్ కురుమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి గణేష్ , జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బయ్య మాట్లాడుతూ పాన్‌గల్ మండలంలో దాదాపు 150 మందికి పైగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది వేతన బకాయిల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. గ్రామాల్లో ప్రతి తక్కువ వేతనానికి పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు 5 నెలల వేతనాలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. నెలకు కేవలం 9500 మాత్రమే చెల్లిస్తున్నారు. అవికూడా ప్రతి నెల సమయానికి రాకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులకు , ఎంపీడీఓలకు సమాచారం ఇచ్చిన గ్రామ పంచాయతీ అకౌంట్‌లో డబ్బులు లేవు సమాధానం ఇస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, కార్మికులకు నెలల తరబడి వేతనాలు లేకుండా ఎలా పని చేస్తారని అన్నారు. కార్మికులు సరిగా పని చేయాలంటే ప్రతి నెల తప్పకుండా వేతనాలను సమయానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బకాయిగా ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఇక మీదట ప్రతి నెల సమయానికి వేతనాలు ఇవ్వాలని లేని యెడల పెద్ద ఎత్తున కార్మికులతో ఆందోళనలు నిర్వహిస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంటయ్య, నాయకులు బిష్మచారి, శివరామ కృష్ణ, ఆనంద్ , సిద్దయ్య, బాలస్వామి, నాగమ్మ, వెంకటయ్య, దేవమ్మ, శంకరమ్మ, చిట్టెమ్మ, పకిరయ్య, మాద్దిలేటి, వెంకటయ్య, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్తి చిదంబరం రూ.50 లక్షల లంచం
### చైనీయులకు వీసా కేసు
### ఇడి కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** చైనీయులకు అక్రమంగా వీసా అనుమతులు ఇప్పించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్తి చిదంబరంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఓ సన్నిహితుడి దగ్గర నుంచి రూ.50 లక్షలను కార్తి అక్రమంగా స్వీకరించాడని ఆరోపించింది. ఇలా వచ్చిన నగదును ఆయన డైరెక్టర్‌గా ఉన్న ఓ కంపెనీలోకి మళ్లించినట్లు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి శివగంగా లోక్‌సభ స్థానం ఎంపిగా ఉన్న కార్తి చిదంబరంను పలుమార్లు విచారించిన ఇడి.. ఆయన స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఇందుకు సంబంధించి ఇటీవల దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో కార్తితోపాటు ఆయన సన్నిహితుడు భాస్కరరామన్‌పై ఈ అభియోగాలు మోపింది. మార్చి 19న ప్రాసిక్యూషన్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీలోని పిఎంఎల్ఎ న్యాయస్థానం.. ఏప్రిల్ 15న హాజరుకావాలంటూ కార్తి తోపాటు ఇతర నిందితులకు సమన్లు జారీ చేసింది. భారీగా నగదు తీసుకొని చైనాకు చెందిన 250 మందికి వీసాలు ఇప్పించారన్నది కార్తి చిదంబరంపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఆయన తండ్రి పి.చిదంబరం కేంద్ర హోంమంత్రిగా ఉన్న సమయంలో ఈ వ్యవహారం జరిగిందని సిబిఐ వెల్లడించింది. దీనిపై దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. చిదంబరం సన్నిహితుడు, ఈ కేసుతో సంబంధం ఉన్న భాస్కరరామన్‌ను సిబిఐ ఇటీవల అరెస్టు చేసింది.

## ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలకు మావోయిస్టులు సిద్ధం
### మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వికాస్ పేరిట ప్రభుత్వానికి లేఖ



**భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు మావోయిస్టులు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వికాస్ పేరిట ఆ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాము పెట్టే షరతులకు ఒప్పుకుంటే చర్చలకు వస్తామంటూ మావోయిస్టుల ఆ లేఖలో పేర్కొన్నారు. తమకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇవ్వాలని, ఆరు నెలల పాటు బలగాలను శిబిరాలకే పరిమితం చేయాలని, కొత్త క్యాంపులు ఎక్కడ ఏర్పాటు చేయకూడదని, తప్పుడు ఎన్‌కౌంటర్లను అరి కట్టాలని మావోయిస్టులు షరతులు విధిస్తున్నారు. తమ షరతులు అన్నిటికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అంగీకరిస్తే చర్చలు జరిపేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని మావోయిస్టులు పేర్కొంటున్నారు. కాగా మావోయిస్టులు పెట్టిన షరతులకు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. మావోయిస్టు దాడుల వ్యూహకర్త హిడ్మా స్వగ్రామమైన పోంపర్తిలో ప్రభుత్వ భద్రతా బలగాలు జాతీయ జెండా ఎగురవేసి అతని తల్లితో మాట్లాడిన అతి కొద్ది రోజుల్లోనే తాము చర్చలకు వస్తామంటూ మావోయిస్టులు స్పందించడం చర్చనీయాంశంగా మారింది . ఇదిలా ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైవైస్ రాజశేఖర్ రెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మావోయిస్టులతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలు జరిపిన విషయం విధితమే.

### నగదు, ఇతర వస్తువుల పరిశీలనకు
## జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా పోలీస్,ఎఫ్.ఎస్.టి సర్వైలెన్స్ టీమ్‌ల ద్వారా తనిఖీలలో తగిన ఆధారం లేకుండా అనుమానస్పదంగా బావించి 50,000 వేల రూ.లకు మించి తీసుకువెళుతున్న నగదు,ఇతర వస్తువులుపై పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ తెలిపారు.సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం,రెండవ ఫ్లోర్,రూమ్ నంబర్ 220లో ఈ కమిటీ పని చేస్తుందని లోక్ సభ ఎన్నికల సందర్భంగా జిల్లా స్థాయిలో పోలీస్,సర్వేలేన్స్ బృందాలు స్వాదీనం చేసుకున్న నగదు,ఇతర వస్తవుల విడుదల చేసేందుకు సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారులు ద్వారా వచ్చిన కేసులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.రాఘవేందర్ రావు,జిల్లా ఆడిట్ అధికారి ఎం.శ్రీనివాస్,జిల్లా సహకార అధికారి బి.పద్మ,ట్రెజరీ శాఖ ఉప సంచాలకులు బి.శ్రీనివాస్‌లతో ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తుందని అన్నారు.పోలీస్ ,ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వేలేన్స్ బృందాల తనిఖీలో సరైన ధృవ పత్రాలు ఆధారాలు లేకుండా ఎఫ్.ఐ.ఆర్ లేకుండా స్వాధీనం చేసుకున్న నగదు బ్యాంకు,ట్రెజరీలో డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు.జిల్లా గ్రీవెన్స్ కమిటీ ప్రతి రోజు సమావేశం జరిపి ఆధారాలు లేకుండా పట్టుబడిన నగదు,వస్తువుల స్వాధీనం పై పోలీస్ పంచనామా కాఫీ,డాక్యుమెంట్‌లు,ట్రెజరీ డిపాజిట్ రసీదు,పట్టుబడిన కేసులలో వ్యక్తులు సరైన ఆధారాలు సమర్పించిన కేసులలో 10 లక్షల లోపు ఉంటే 24 గంటలలోపు రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు.10 లక్షల పై బడి నగదు,వస్తువులు స్వాధీనం చేసుకున్న కేసులలో వాణిజ్య పన్నుల శాఖ,ఇన్‌కమ్ టాక్స్ శాఖ కు సమాచారం అందించి క్లియరెన్స్ రాగానే విడుదల చేస్తుందని అన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకొని వెళ్లవద్దని ఆయన అన్నారు.ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే అట్టి మొత్తం సీజ్ చేసి,డిపాజిట్ చేయడం జరుగుతుందని,ఎన్నికల కు సంబంధం లేదని సరైన ఆధారాలను చూపిస్తే తిరిగి ఇచ్చేస్తారని,అత్యవసర వైద్యం,కళాశాల ఫీజులు,వ్యాపారం,పెళ్లిళ్ళు,ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు.



## బిఎస్‌పి ఒంటరిగానే పోటీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్‌పి పార్టీ ఒంటరిగానే పోటిచేస్తుందని బిఎస్‌పి జిల్లా ఇంచార్జీ బీసమొళ్ల యోసేఫ్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి వ్యక్తులు వస్తుంటారు పోతుంటారు అన్నారు. పార్టీ నిరంతరం నడుస్తూనే ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్‌పిపార్టీ 17 స్థానాల్లో ఒంటరిగానే పోటిచేస్తుందన్నారు. దేశం, రాష్ట్రంలోని ఏకూటమితో బిఎస్‌పి పార్టీకి పొత్తులు లేవన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా శ్రమించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్‌పి అభ్యర్థి గెలుపుకోసం పని చేద్దామన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జీ ఎట్టి ఆంజనేయులు, కల్వకుర్తి అసెంబ్లీ కార్యదర్శి రమేష్‌నాయక్, రాజు, కల్వకుర్తి మండల అధ్యక్షులు రమేష్, మహేష్, జంగయ్య, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ యువ నాయకులు కొత్తపేట రాకేష్ 30వ జన్మదిన వేడుకలను పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాకేష్ 30వ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులు రాకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, వైస్ ఎంపిపి లోకనేని దీపిక లక్ష్మణరావు, మైసమ్మచైర్మన్, సింగిల్‌విండోచైర్మన్ బుడు గు శ్రీనివాస్, మాజీసింగిల్‌విండోచైర్మన్ దేవరపాక బాలస్వామి, మాజీ ఎంపిపి వరదరాజుల వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు శశికళ శివశంకర్, రవికుమార్, మాజీ ఎంపిటిసి దండునర్సింహ్మా, సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.

## దొంగల బీభత్సం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట మండలం చందాపూర్ గ్రామంలో బుధవారం అర్థరాత్రి దొంగలు పలు ఇళ్లలో చొరబడి హాల్‌చల్ చేశారు. గురువారం ఉదయం బాధితుల వివరాల ప్రకారం గ్రామస్తులు అందరూ గాఢనిద్రలో ఉండగా కొంతమంది దొంగలు ఇళ్లలోకి చొరబడి బీరువాలుపగులకొట్టి దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో ఇటీవలే కొత్త ఇల్లు కట్టుకున్న ఓ వ్యక్తి తన ఇంట్లో నిద్రిస్తుండగా పాత ఇంట్లో ఇంటితాళం పగులకొట్టి బీరువాలా కర్లు గడ్డపారతో పెకిలించి రూ.50వేల నగదు, 2తులాలబంగారం, 15తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అదేగ్రామంలో మరో నాలుగు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

## చెంచుల జీవనోపాధిపై ఎన్ఐఆర్‌టి సమీక్ష

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నల్లమల అభయారణ్యమైన అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని చెంచుల జీవనోపాధిపై అటవీ ఉత్పత్తులు తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నట్లు ఎన్ఐ ఆర్‌టి నాయకులు ప్రతినిధులు తెలిపారు. గురువారం అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్ఐ ఆర్‌టి అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యరంజన్‌మహాకూల్ ఆధ్వర్యంలో 25మంది చెంచు సభ్యులతో మాట్లాడారు. ఈసందర్భంగా చెంచులు మాట్లాడుతూ అటవీ ఉత్పత్తుల సేకరణ వాటి మార్కెటింగ్ తదితర అంశాలపై సమస్యలు వివరించారు. వాతావరణంలో వచ్చిన మార్పులు చెంచుయేతరులు ఉత్పత్తి సేకరణ కారణంగా అటవీ ఉత్పత్తులు భారీగా తగ్గాయని తెలిపారు. కష్టపడి సేకరించిన ఉత్పత్తులకు గిరిజన సహకార సంస్థ గిట్టుబాటు ధర అందించడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే గిరిజన సంక్షేమ పథకాలు తమకు అందడంలేదన్నారు. అటవి ఉత్పత్తుల సేకరణలో ఫారెస్టు నిబంధనలు , అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్న ఇబ్బందులను వివరించారు.

## భక్తికి క్రమశిక్షణకు మారు పేరు రంజాన్



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలోని యూఆర్ ఫంక్షన్ హాల్‌లో ముగిసిన తరావీ నమాజ్ భగవంతునిపై భక్తికి క్రమ శిక్షణకు మారుపేరు రంజాన్ మాసం. ఉపవాసాలతో పేదవాని ఆకలిఇ గుర్తించడానికి భగవంతుడు ఉపవాస దీక్షలను చేపట్టాలని పవిత్ర ఖురాన్ గ్రంథం ద్వారా మానవునికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రతి ముస్లిం సోదరుడు నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టి అల్లా మార్గంలో నడవాలని మౌలానా, ఇలియాస్ మౌలానా, వహిద్ మౌలానాలు అన్నారు. మిగితా 20 రోజులు ఉపవాస దీక్షలు చేపట్టి తరావీ నమాజ్‌లో పాల్గొని అల్లాహ్ పవిత్ర ఖురాన్ గ్రంథంలో ఆదేశించిన ఆదేశాలను పాటించి మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మౌలానా అబ్దుల్ హసన్ సభాధ్యక్షత వహించగా , కౌన్సిలర్ ఖాజా మైనోద్దీన్ , యూఆర్ ఫంక్షన్ హాల్ యజమాని ఎండి ఖదీర్ , 10 రోజుల్లో తరావీ నమాజ్ ద్వారా పవిత్ర ఖురాన్ గ్రంథం నోటికి చదిఇవి తరావీ నమాజ్ ప్రార్థన పూర్తి చేసిన హఫీజ్ ఎహెసాన్‌కి యూత్ కమిటీ తరపున రూ. 11వేలు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు హనీఫ్ , మహిబూబ్ , అర్షద్ , యూఆర్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు షబ్బీర్ అహ్మద్ , రింగ్ బీడీ ఫ్యాక్టరీ నిజాంసాబ్ , హఫీజ్ ఫయాజ్ , మునీర్ మౌలానా, టైర్ పంచర్ షాప్ నిర్వాహకులు ఖలీల్ , బీఆర్ఎస్ ఉద్యమకారుడు చాంద్ పాషా, పాత సామాను నిర్వాహకులు హాజీ ముర్తుజా, మహిమూద్ , అప్టికల్ అఫ్రోజ్‌లతో పాటు మరో 50 మంది యువకులు పాల్గొనగా యూఆర్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు , ఎన్‌హెచ్ టీవీ రిపోర్టర్ అజహర్ సలాతు వసలాం చదివి తమ భక్తిని చాటి కార్యక్రమానికి వీడ్కోలు పలికారు.



## కార్మికుల హక్కులు ఎఐటియుసితోనే సాధ్యం : ఉపేందర్

ప్రజాపక్షం/బెల్లంపల్లి : కార్మిక హక్కులు ఎఐటియుసి తోనే సాధ్యమని బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. సింగరేణి సంస్థ లోని మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్ పోర్ట్ కార్మికుల సమ్మె రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కోల్ ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యంతో యూనియన్ నాయకులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చ లలో డ్రైవర్లకు రూ.20,500లు, క్లీనర్లకు రూ.10,250లు చెల్లించడానికి ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎఐటి యుసి కృషి ఫలించిందని, కార్మికులకు ప్రతి నెల 15వ తేదీలోపు వేతనాలు చెల్లించడానికి ఒప్పందం జరిగిందని అన్నారు. టాన్స్ పోర్ట్ యాజమాన్యం కార్మికుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమి స్తున్నట్టు తెలిపారు. సమ్మెకు సహకరించిన మీడియాకు, పోలీస్ డిపా ర్ట్మెంట్ వారికి ఎఐటియుసి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో సిపిఐ మందమర్రి కార్యదర్శి దుర్గారాజు, సహాయ కార్యదర్శి రాజేశం, ట్రాన్స్ పోర్ట్ కార్మికులు, డ్రైవర్ల సంఘం నాయకులు కుమార్, శ్రీశైలం, పల్లె కుమార్, శ్రీనివాస్, అనిల్, ఖాజా, రవి, సంతోష్, ఉమా మహేశ్వర్, కృష్ణ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇండో అమెరికన్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దుచేయాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతం



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : గోదావరి ఖని పారిశ్రామిక ప్రాంతంలోని ఇండో అమెరికన్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని ఇండో అమెరికన్ హై స్కూల్లో మూడో తరగతి చదువుతున్న పునీత్ అనే విద్యార్థినిని ఆ కార ణంగా చితకబాదిన ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయా లని,ఇండో అమెరికన్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని అన్నారు. మూడు నెలల క్రితం ఆర్.ఎఫ్.సిఎల్ లోని శ్రీ చైతన్య స్కూల్లోని విద్యార్థిని చితకబాదిన ఘటనలు మరిచిపోక ముందే ఇలాంటి అరాచకా లకు పాల్పడుతున్నరని, ఇలాంటి పాఠశాలలపై విద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృత్తం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా విద్యాధికారులు స్పందించి స్కూల్ గుర్తింపు రద్దు చేసి, ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్ర మంలో ఇనిగాల ప్రశాంత్, పసుల రాజశేఖర్ పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణతోనే మానవాళి మనుగడ



ప్రజాపక్షం /సిర్పూర్‌టి : అడవుల సంరక్షణతోనే మానవాళికి మనుగడ ఉంటుందని, వాతావరణ సమతుల్యత కేవలం అడవులు, అటవీ జంతువు లతోనే సాధ్యం అని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. గురువారం సిర్పూర్ టి మండలం లోని ఇటికల్ పహాడ్ అడవి ప్రాంతం పరిధిలోని ప్లాంటేషన్ లను జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, అడి షనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాష్ భీమ్ రావు సందర్శించి ఇటికల్ పహాడ్‌లో భూమిని గుర్తించి ప్లాంటేషన్ చేయుటకు నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్ నుండి మాలనీ రోడ్డు వలన కోల్పోతున్న రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతానికి బదులుగా ఇటికల్ పహాడ్ భూమిని పరిశీలించి ప్లాంటేషన్లను చేయుటకు నిర్ణయించడం జరిగిందని, అటవీ సంపద కాపా డడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కల పెంపకంతో కాలుష్యంను నుండి వాతావరణాన్ని కాపాడవచ్చని, ప్లాంటేషన్‌లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయడం జరగుతుందని తెలిపారు. వారి వెంట సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్ అధి కారి పూర్ణ చందర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి. మోహన్ రావు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఎస్. సాహిద్, నరేష్, రవీనాలు ఉన్నారు.

## వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునేలా చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌కై వారికి అందచేయాలని ఆర్డీవో గూడూరి శ్రీనివాస్‌రావు అన్నారు. కేంద్ర ఎన్నిక సంఘం తెలంగాణ రాష్ట్రంలోని లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్‌లో భాగంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 13 నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 88 మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గం మిర్యాలగూడ, మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల పరిదిలోని 264 పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులతో వారి బూత్ స్థాయి అధికా రుల, సూపర్‌వైజర్ల సమీక్షా సమావేశం స్థానిక ఏఆర్సీ గార్డెన్‌లో గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 సంవ త్సరాలు దాటిన వృద్ధులుతోపాటు దివ్యాంగుల ఓటర్ల వివరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారికి ఫారం 12డి దరఖాస్తులను జారీ చేయడం జరిగిందని, దరఖాస్తులు సంబంధిత ఓటర్లకు పంపిణి చేసి వారి నుంచి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా కోరారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. రూట్ సెక్టార్ అధికారులు, తహసీ ల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సీడీపీవో, ఆర్ఐలు పాల్గొన్నారు.



# పెట్రోల్‌పంపు కార్మికుల శ్రమ దోపిడీ

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్




ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : పెట్రోల్ పంపు కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోపిడి చేస్తున్నాయని ఎఐటియుసి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ అన్నారు. గురువారం హన్మకొండ బాలసము ద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్ష తన జరిగిన పెట్రోల్ పంపు కార్మికుల సమావే శంలో జక్కు రాజు గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై అనేక పన్నుల పేరుతో ప్రజలపై భారాన్ని మోపుతున్నా యని, మరోవైపు పెట్రోల్ పంపులలో పని చేస్తున్న కార్మికులకు చాలీ చాలని వేతనాలు ఇస్తూ యాజమాన్యాలు వారి శ్రమను దోచుకుం టున్నాయని అన్నారు.పెట్రోల్ పంపు కార్మికుల చేత రోజుకు 12 గంటల నుండి 16 గంటల వరకు పని భారం మోపుతున్నాయని, జిల్లాలో 500 పైగా ఉన్న పెట్రోల్ పంపులలో ఎక్కువ శాతం మహిళలనే పెట్టుకుని తక్కువ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ప్రతి పెట్రోల్‌పంపులో పని చేస్తున్నకార్మికునికి రూ.22వేల నుండి 26 వరకు వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సంవత్సర కాలం పూర్తి అయిన వారికి పిఎఫ్ వర్తింప చేయాలని, అకారణంగా తొలగిస్తే పది సంవత్సరాల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ పంపు కార్మికుల సమ స్యలను విస్మరిస్తే ఏఐటీయూసి తరుపున పోరా డుతామని అన్నారు. ఈ సమావేశంలో వంద మంది పెట్రోల్ పంపు కార్మికులతో పాటు ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగ పాయి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి రామరాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నియమ నిబంధనలు

### మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ, మీడియా సెంట ర్లను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంసీఎంసీ, మీడియా సెంటర్లలో విధులు నిర్వర్తించే సిబ్బం దితో పాటు అక్కడ ఏర్పాట్లను సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వి.భాను ప్రసాద్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నిక లకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కలెక్టరే ట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీ లించి ఇప్పటి వరకు ఏవైనా ఫిర్యాదులు వచ్చా యా అని సంబంధిత అధికారులను అడిగి తెలు సుకున్నారు. ఫిర్యాదులకు సంబంధించిన సమా చార నివేదికను ఎన్నికల విభాగానికి అందించా లని సూచించారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ : హనుమకొండలోని నయీంనగర్‌లో తేజస్వి హైస్కూల్, హసన్‌పర్తి మండలం భీమారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో కొనసాగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను, విద్యార్థుల హాజరు శాతాన్ని కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలె క్టర్ ఆదేశించారు.

**ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ**

ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన స్టాటి స్టికల్ సర్వేలెన్సు టీం(ఎస్ఎస్‌టీ) చెక్‌పోస్టును హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న తనిఖీలను వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో కొనసాగు తున్న వాహనాల తనిఖీలను కలెక్టర్ పరిశీలిం చారు. అదే విధంగా చెక్‌పోస్టు నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.





## మూడు నెలలుగా వేతనాల్లేవు

### జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వినాయక ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి : ఎఐటియుసి

ప్రజాపక్షం/అచ్చంపేట : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గత మూడునెల లుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వినాయక ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశం కర్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఆస్ప త్రిలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు మూడునెలల నుండి వేతనాలు ఇవ్వ కుండా కార్మికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వేతనాలు ఇవ్వక పోవడంవలన కార్మికుల జీవనం సాగించేది ఎట్ల కార్మికులు అద్దె ఇంట్లో ఉంటూ అద్దె ఇవ్వకపోతే ఇల్లు ఖాళీ చేయమని ఇంటి యజమానులు ఇబ్బం దులకు గురిచేస్తున్నారన్నారు. ఆస్పత్రిలో మలమూత్రాలను శుభ్రంచేస్తూ పని చేస్తున్న సందర్భంలో కూడా కార్మికుల చేతులకు బ్లౌజులుకాని కాళ్లకు బూట్లు షూ కాని పనిచేస్తున్న సందర్భంలో బ్లీచింగ్‌పౌడర్ చల్లినప్పుడు బాత్‌రూం సాఫ్ట్ పనిచేసినప్పుడు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కనీసం డ్రెస్సులు , జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ విఠల్ తప్పించుకు తిరుగుతున్నారన్నారు. వెంటనే ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో అచ్చంపేట ఏరియా ఆస్పత్రి కార్మికులు శ్రీను, వెంకటయ్య, రామ కృష్ణ, రాజు, లక్ష్మణ్, పద్మ, ఆశమ్మ, చెన్నమ్మ, శ్రీదేవి, బాలింగమ్మ, జయమ్మ, బాలమణి పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే నిరవధిక సమ్మె



ప్రజాపక్షం/నల్లగొండ: ఎన్‌హెచ్ఎం స్కీంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి పెండింగులో ఉన్న వేతనా లతో పాటు 7 నెలల పిఆ ర్‌సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తా మని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో డిఎంహెచ్‌ఒ కార్యాలయంలోని సూపరిండెంట్ మంజులతకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలల వేతనాలు, పిఆర్‌సి ఏరియర్స్ ఏడు నెలల డబ్బులు చెల్లించాలని అనేక రోజుల నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రేపు మాపు అంటూ కాల యాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 22 లోపు వేతనాలు ఏరియర్స్ బకాయిలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్ఎం యూనియన్ జిల్లా నాయకులు రాయల గీతా రాణి, చిత్రం సరిత, లెనిన్ పాల్గొన్నారు.

## వైవిధ్యత యాంత్రికరణపై రైతుల దృష్టి

ప్రజాపక్షం/నల్లగొండ : పంట సాగులో వైవిధ్యత, యాంత్రికరణపై దృష్టి సారిస్తే కూలీల కొరతతో పాటు అవసరమైన పంటల కొరత తగ్గించే దిశగా సాగుచేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవ సాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి రఘుపతి రెడ్డి రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవి ద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా దక్షిణ తెలంగాణ, పంటల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహాసంఘం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో జ్యోతి ప్రజల్వన చేసి ప్రారం భించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ వి సుధారాణి మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ మండలాల్లో 20శాతం పై చిలుకు రైతులు నేరుగా విశ్వ విద్యాలయం నుండి విస్తరణ సేవలను పొందుతున్నారన్నారు. పరిశోధ నలో నిరూపించబడ్డ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు క్షేత్రస్థాయిలో పరిశో ధనలు నిర్వహించి వాటి ఫలాలను పొందే విధంగా రాబోయే కాలంలో శాస్త్రవేత్తలు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ ఎస్ వాణిశ్రీ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్ కుమార్, ఏరువాక కో ఆర్డినేటర్‌లు భరత్ భూషణ్, అనిల్ కుమార్, లక్ష్మణ్, కంపసాగర్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్ శ్రీనివాస్, రైతులు, ఎన్జీవోలు రమణారెడ్డి, లావణ్య, నారాయణ తదితరులున్నారు.



# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు

### ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎంఎల్ఎ బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా సంద ర్శించి ఉదయం రావాల్సిన డాక్టర్లు సమయానికి ఆసుపత్రికి రాకపోవడంతో అధికారులకు ఫోన్ చేసి హెచ్చరించారు. ఆసుపత్రిలోని మహిళ, ప్రసూతి, క్యాజువాలిటి, చిన్న పిల్లల వార్డులను కలియ తిరిగారు. అలాగే ఆసుపత్రి పరిసరాలు, రోగులు ఉండే వార్డులన్ని పరిశుభ్రంగా ఉంచాలని వారిని ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇస్తుంటే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్యులు, సిబ్బందిపై మండిప డ్డారు. ఆసుపత్రిలో ఉన్న గ్రామస్థులు, రోగులతో మాట్లాడి వైద్యం ఎలా జరుగుతుందని అడిగి తెలు సుకున్నారు.

**నిత్య అల్పాహార వితరణ అభినందనీయం**

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల వెంట వచ్చే సహాయకులకు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ జాయింట్ సెక్రటరీ మీల్స్ ఆన్ వీల్స్ ప్రోగ్రాం ఛైర్మన్ మాశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న నిత్య ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం గురువారం నాటికి 500వ రోజుకు చేరుకుంది. లయన్స్‌క్లబ్ సభ్యుడు వందనపు ప్రతాప్ పుట్టిన రోజు సందర్భంగా సుమారు 300 మందికి అల్పా హారం వితరణ చేశారు. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ తీగల మోహన్‌రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ శివప్ర సాద్, మీల్స్ ఆన్ వీల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోఆర్డినే టర్ రాధాకృష్ణ, కెఎన్.ప్రసాద్, రైస్ మిల్లర్స్ అసో సియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ 500 రోజుల నుంచి నిరంతరంగా నిత్య అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీనివాస్ టీం సభ్యులను అబినందించారు. లయన్స్ క్లబ్ సేవలు నిరంతరం కొనసాగించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే లయన్స్‌క్లబ్ సభ్యు లను సన్మానించారు. కార్యక్రమంలో యనగండ్ల లింగయ్య, బాబురావు, మురళీధర్‌రెడ్డి, ముక్క పాటి వెంకటేశ్వర్‌రావు, రామారావు, జగన్మోహన్ రావు, బిఎం.నాయుడు, సైదులు, రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విజయభాస్కర్, శంకర్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేజ్రీవాల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

లిక్కర్ కేసులో తనను అరెస్టు చేయకుండా ఉత్త ర్వులు జారీ చేయాలంటూ కేజ్రీవాల్ చేసుకున్న పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసిన కొన్ని గంట ల్లోనే ఇడి అధికారులు ఆయన నివాసానికి చేరు కోవడంతో అరెస్టుపై సందేహాలు మొదల య్యాయి. ఇదే కేసులో, అప్పటి ఢిల్లీ ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియా, ఆ పార్టీ కీలక నేత సంజయ్ సింగ్‌సహా 15 మందిని ఇడి అధికా రులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే తెలంగాణ ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితను ఇడి అధికారులు హైదరాబా ద్‌లోని ఆమె నివాసంలోనే అరెస్టు చేసి, ఢిల్లీకి తర లించారు. దీనితో, ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ అరెస్టు కూడా తప్పదన్న ఊహాగానాలే చివరికి నిజమయ్యాయి. ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించ దంతో, ఆయనను అరెస్టు చేయడం సులభం కాదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిం చారు. కానీ, ఇడి అధికారులు ఆయనను అదుపు లోకి తీసుకున్నారు. అప్పటికే అక్కడ భారీగా భద్రత బలగాలు చేరుకున్నాయి. ఇలావుంటే, విచారణకు హాజరుకావాల్సిందిగా కేజ్రీవాల్‌కు ఇడి 9 పర్యాయాలు నోటీసులు పంపింది. రెండు సార్లు సమన్లు జారీ చేసింది. ఆయన విచారణకు హాజరుకాలేదు. ఈ కేసులో తనను అనవసరంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటూ, దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు. దృశ్య మాధ్యమం ద్వారా మాత్రమే విచారణకు హాజరు కాగలనని ఇటీవలే ప్రకటించారు. అదే సమ యంలో, ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఇడి కేసులు పెడుతున్నదని పేర్కొంటూ, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కానీ, అక్కడ ప్రతికూలంగా తీర్పురావడం, ఆ తర్వాత ఇడి అధికారులు సర్చ్ వారెంట్‌తో ఆయన నివా సానికి చేరుకొని సోదాలు జరపడం వెంటవెం టనే జరిగాయి. సోదాలు నిర్వహించిన వెంటనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తున్నట్టు ఇడి అధికారులు ప్రకటించారు. ఇడి కార్యాలయానికి వెళ్లే అన్ని దారులను పోలీసులు ముందుగానే మూసివే శారు. ఆయనను న్యాయ మూర్తి ముందు ఇప్పుడే హాజరు పరుస్తారా లేక శుక్రవారం కోర్టుకు తీసుకెళతారా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

**అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వం**

అంతకు ముందు మద్యం విధానానికి సంబంధిం చిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అరెస్టు నుంచి మినహా యింపు కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరిం చింది. ప్రస్తుతం కేసు పురోగతి దృష్ట్యా ఇందులో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు ఇడి తొమ్మిది సార్లు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. చివరిసారి ఇచ్చిన నోటీసులకు గురువారం హాజరుకావాల్సి ఉండగా.. ఆయన వెళ్లలేదు. తనకు జారీ అయిన సమన్లను సవాల్ చేస్తూ ఢిల్లీ సిఎం ఇటీవల హైకో



ర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. విచారణకు ఎందుకు హాజరుకా వడం లేదని అడిగింది. అరెస్టు చేస్తారని భావి స్తుంటే చట్టపరమైన రక్షణ ఎందుకు తీసుకోలే దని ప్రశ్నించింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. ఈ క్రమంలోనే కేజ్రీవాల్ గురువారం మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇడి తనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా నిలువరించా లని హైకోర్టును అభ్యర్థించారు. దీనిపై ఇరుప క్షాల వాదనలు విన్న ధర్మాసనం.. సిఎంకు అరెస్టు నుంచి మినహాయింపు ఇచ్చేందుకు నిరాక రించింది. కేజ్రీవాల్ అభ్యర్థనపై ఇడిని వివరణ కోరింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. సమన్లను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో పాటే దీన్ని ఏప్రిల్ 22న విచా రిస్తామని తెలిపింది. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సిబిఐ కేజ్రీవాల్‌ను విచారిం చింది. గతేడాది ఏప్రిల్‌లో 9 గంటల పాటు ప్రశ్నించారు. తాజాగా ఈడీ నమోదు చేసిన కేసు లోనూ వరుసగా సమన్లు అందుతున్నాయి. ఇక ఇదే కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోదియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టయి జైల్లో ఉన్నారు.



## నీటి సరఫరాలో అవాంతరాలు ఉండొద్దు

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం ప్రధాన కార్యాలయం లో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమా వేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచ నలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధి కారులు ఆయా డివిజన్ లలో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి 66 డివిజన్ లలో ప్రతి డివిజన్ కు సూక్ష్మ ప్రణా ళిక (మైక్రో ప్లాన్ ) తయారు చేయాలని స్థానికం గా ఉన్న పరిస్థితుల పై అవ గాహన ఏర్పరచు కొని తగు పరిష్కార మార్గాలతో సిద్ధం గా ఉండాలని, తక్కువ నీరు వచ్చే ప్రాంతాలను (టెయిల్ ఎండ్) గుర్తించాలని, వేసవి కాలం దృష్ట్యా ఆయా డివిజన్ లలో ఎన్ని చేతి పంపులు ఉన్నాయి? అందులో పని చేసేవి ఎన్నిక? రిపేరింగ్ దశలో ఎన్ని ఉన్నాయో వాటికి సంబంధించిన ప్రోగ్రెస్ ఉండాలని 23 రోజుల్లో మరమత్తులు చేయించి వినియోగంలోకి తీసు కురావాలని, చివరి పాయింట్ వరకు ఉన్న గృహాలకు నీరు అందించాలని ఇందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టత ఉండాలని, నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో వాల్వుల పనితీరు పరిశీలించాలని ఈ సందర్భం గా కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు శ్రీనివాస్, రాజయ్య, డిఈలు రవికుమార్, సంతోష్, బాబు, సారంగం, కృష్ణమూర్తి, రంగారావు, దేవానంద్ పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com